


శివమొగ్గ దసరా వేదికపై ఉమాశ్రీ, అధికారులు

'మాది సామాన్యుల ప్రభుత్వం'

మైసూరు, న్యూస్‌టుడే: తమది సామాన్యుల, రైతు పరమైన ప్రభుత్వమని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి పేర్కొన్నారు. సేద్యాన్ని లాభదాయకం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పేదలు, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని గ్యారంటీ పథకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. మైసూరు దసరా వేడుకల్లో భాగంగా జేకే మైదానంలో ఏర్పాటు చేసిన రైతు దసరాను శనివారం ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలకు పెద్ద పీట వేస్తూనే పశుసంవర్ధక, ఉద్యానం, పట్టు శాఖల్లోనూ పలు మార్పులు తీసుకు వస్తున్నామని వివరించారు. సమగ్ర వ్యవసాయ విధానంతోనే రైతుల జీవితాల్లో మార్పులు వస్తాయని స్పష్టం చేశారు. గతేడాది రూ.వెయ్యి కోట్లతో వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి లబ్ధిదారులు, గ్రామ పంచాయతీలకు అందించామని గుర్తు చేశారు. మంత్రి వెంకటేశ్, చెస్కాం అధ్యక్షుడు రమేశ్ బండిసిద్దేగౌడ, ఎమ్మెల్యే హరీశ్ గౌడలతో కలిసి ఉత్తమ రైతులను ఇదే సందర్భంలో సత్కరించారు. ముఖ్యమంత్రి స్థానం ఖాళీగా లేదని, తాను ఆ పోటీలో లేనని చెలువరాయస్వామి ఇదే సందర్భంలో స్పష్టం చేశారు. సిద్దరామయ్య ఐదేళ్ల ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు.



ఢంకా మోగించి మైసూరులో రైతు దసరాను ప్రారంభిస్తున్న చెలువరాయ స్వామి, కే వెంకటేశ్



కరుణించు తల్లీ.. బనశంకరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బెంగళూరులోని బనశంకరి మాతకు పట్టిచీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)


నేటి నుంచి యువ దసరా

మైసూరు, న్యూస్‌టుడే: నేటి (ఆది) నుంచి 10 వరకు యువ దసరాను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ వెల్లడించారు. నేడు గాయని శ్రేయా ఘోషాల్, సోమవారం సంగీత దర్శకుడు రవి బస్రూరు, మంగళవారం బాలీవుడ్ ర్యాపర్ బాద్‌షా, బుధవారం సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, చివరి రోజు ఇళయరాజా తమ బృందాలతో కలిసి ప్రదర్శనలు ఇస్తారని చెప్పారు. నిత్యం 50-70 వేల మంది యువ దసరా కార్యక్రమాలకు హాజరవుతారని అంచనా వేశామన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బందోబస్తుకు నలుగురు ఎస్పీలు, 12 డీవైఎస్పీలు, 37 ఇన్‌స్పెక్టర్లు, 76 మంది ఎస్సైలు, 110 ఏఎస్సైలు 600 కానిస్టేబుళ్లు, 100 మంది మహిళా కానిస్టేబుళ్లు, 300 హోంగార్డులు, ఆరు కేఎస్ఆర్పీ, 10 డీఏఆర్ బెటాలియన్లను భద్రతకు నియమిస్తున్నామని చెప్పారు. అక్టోబరు 12 వరకు మైసూరుకు వచ్చే అన్ని పర్యాటకుల వాహనాలకు పన్ను మినహాయింపును ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

కుల నివేదిక.. రాజకీయ కాక

◆ సమీక్షపై సర్కారు మల్లగుల్లాలు ◆ రాజకీయాల్లో కలకలం సృష్టించనున్న సామాజిక, ఆర్థిక సమీక్ష ◆ వచ్చే మంత్రివర్గంలో కీలక చర్చకు వేదిక

ఈనాడు, బెంగళూరు: కుల సమీక్షగా పిలిచే సామాజిక, ఆర్థిక సమీక్ష రానున్న రోజుల్లో మరో రాజకీయ అస్త్రంగా మారనుంది. రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ రూపొందించిన ఈ సమీక్ష మధ్యంతర నివేదిక గత ఫిబ్రవరిలోనే సర్కారు చెంతకు చేరింది. కానీ ఆ సమీక్షను ఇంత వరకు ప్రభుత్వం ఆమోదించటం కానీ, తిరస్కరించటం కానీ జరగలేదు. కేవలం స్వీకరణకే పరిమితమైన ఈ సమీక్ష త్వరలో పట్టాలెక్కనుంది. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఓ బీసీ సంక్షేమ సమావేశంలో పాల్గొని ఈ సమీక్ష గురించి ఓ ప్రకటన చేశారు. త్వరలో నిర్వహించే మంత్రి వర్గ సమావేశంలో ఈ సమీక్షపై చర్చించి సర్కారు తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. రానున్న మంత్రివర్గ సమావేశమే అందుకు వేదిక కల్పించనుంది. ఈ సమీక్ష కాస్త బహిర్గతమైతే రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు సామాజికంగానూ ఎడతెగని చర్చగా మారే అవకాశం లేకపోలేదు.



గత ఫిబ్రవరిలో నివేదికను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

అదే ఓ సంచలనం


ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తొలిసారి బాధ్యతలు చేపట్టిన సమయంలో ఈ సమీక్షకు పచ్చజెండా ఊపారు. 2015 ఏప్రిల్‌లో ఈ సమీక్షకు ఆమోదం తెలిపిన సిద్ధరామయ్య సర్కారు మరోసారి సర్కారు రచించిన తర్వాత ఆ నివేదికపై వార్తల్లో నిలిచింది. 2015నుంచి మూడేళ్ల పాటు ఈ సమీక్ష నిర్వహించిన బీసీ కమిషన్ తీరా సర్కారుకు ఆ నివేదికను అందించే సమయానికి ఎన్నికలొచ్చాయి. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్‌ల సంకీర్ణ ప్రభుత్వం వచ్చినా అప్పటి ముఖ్యమంత్రి కుమారస్వామి ఈ నివేదికపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఏడాది తర్వాత సంకీర్ణ సర్కారు కూలిపోయి భాజపా సర్కారు వచ్చినా ఈ నివేదిక ఎటూ కదలలేదు. మూడేళ్లకుపైగా సమీక్ష చేపట్టి రూపొందించిన ఈ నివేదిక కోసం రూ.164.84 కోట్లు వ్యయం చేశారు. భాజపా సర్కారు సమయంలో ఈ నివేదికపై బీసీ కమిషన్ కార్యదర్శి సంతకం లేదన్న ఆరోపణ వినిపించటం, ఈ నివేదికలో కొన్ని పత్రాలు కనిపించలేదన్న ఆరోపణ కూడా వినిపించింది. ఈ కారణంగానే ఈ సమీక్ష అవైజ్ఞానికంగా ఉందని అప్పటి ప్రభుత్వాలు తోసిపుచ్చాయి.

లోక్‌సభ ఎన్నికల వేళ

సరిగ్గా లోక్‌సభ ఎన్నికల ముందు మరోసారి ఈ సమీక్షకు రెక్కలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తే కుల సమీక్షను ఆమోదించి బహిర్గతం చేస్తామని ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇండియా కూటమి కూడా దేశవ్యాప్తంగా కుల సమీక్ష చేపడతామన్న హామీతో ఎన్నికలను ఎదుర్కొన్నాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి గత ఎన్నికలతో పోలిస్తే మంచి ఫలితాలు సాధించినా కేంద్రంలో ప్రభుత్వాన్ని మాత్రం ఏర్పాటు చేయలేకపోయింది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అప్పటికే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఉండటం, తాజా లోక్‌సభ ఎన్నికల్లోనూ 9 స్థానాలతో గెలవటంతో ఈ సమీక్షపై ఇచ్చిన హామీని నెవరవేర్చే పనిలో పడింది. గత ఫిబ్రవరిలోనే ఈ సమీక్షను బీసీ కమిషన్ అధ్యక్షుడు జయప్రకాశ్ హెగ్డే ముఖ్యమంత్రికి ఈ నివేదికను సమర్పించారు. ఇన్ని రోజుల తర్వాత మరోసారి ఈ నివేదికను ఆమోదిస్తామన్న ప్రటకన ముఖ్యమంత్రి నుంచి వెల్లడైంది.

మొదలైన అలజడి

ఈ సమీక్ష బహిర్గతం కావాలని ఇటీవలే కార్మిక మంత్రి సంతోశ్ లాడ్, గ్యారంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ, మాజీ ఎమ్మెల్సీ వి.ఆర్.సుదర్శన్, ఎమ్మెల్సీ ఉమాశ్రీ, కొప్పళ్ల ఎమ్మెల్యే రాఘవేంద్ర హిత్నాళ్ తదితరులంతా సమావేశమై ముఖ్యమంత్రితో ఈ నివేదికను ఆమోదించాలని మనవి చేశారు. వీరంతా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుదారులే కాకుండా బీసీ నేతలు కూడా. రానున్న సోమవారం వీరంతా ముఖ్యమంత్రితో మరోసారి చర్చించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఇదే నివేదికను తిరస్కరించేందుకు మరో రాజకీయ నేతల బృందం సిద్ధమైంది. ఒక్కలిగ, లింగాయత్ సముదాయానికి చెందిన నేతల బృందం మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ, ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వంటి ప్రముఖుల సంతకాలతో కూడిన మనవి పత్రాన్ని సర్కారుకు సమర్పించటం కలకలం రేపింది. వీరంతా అవైజ్ఞానికంగా తయారైన కుల సమీక్షను ఆమోదించరాదని సర్కారుకు విన్నవించటం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సంకటం కల్గించే అంశం. ఇప్పటికే సుప్రీం కోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ సమీక్షపై ఉన్న అడ్డంకి కాస్త తొలగిపోయింది. రానున్న రోజుల్లో మంత్రి వర్గం తీసుకునే నిర్ణయం అటు ప్రభుత్వంలోనే కాదు రాజకీయ వర్గాల్లోనూ పెను దుమారాన్ని రేపక మానదు.



'దుర్గ'ల విహారం

దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు జరుగుతున్నాయి. శనివారం బెళగావిలో 'దుర్గామాత దౌడు' కార్యక్రమంలో భాగంగా యువతులు సమరూప దుస్తుల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, బెళగావి

కంటోన్మెంట్ మార్గం పనుల పరిశీలన

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ శనివారం బెంగళూరులోని కంటోన్మెంట్ రైల్వేమార్గం పనులను తనిఖీ చేశారు. పురోగతిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. ఆయన వెంట సహాయమంత్రి సోమణ్ణ, ఇతర ప్రతినిధులు ఉన్నారు. –న్యూస్‌టుడే, (మల్లేశ్వరం) బెంగళూరు



'లక్షమంది వచ్చినా భయపడను'

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నేను ఎవరికీ భయపడను. నన్ను రాజకీయంగా పెంచి పెద్ద చేసిన ప్రజలు, దేవుడికి భయపడతానే కాని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లాంటి వ్యక్తులు లక్షల మంది వచ్చిన భయపడబోనని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి హెచ్చరించారు. శనివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిద్ధరామయ్య అంటే ఎవరికి భయమని ప్రశ్నించారు. ఆయన దేవుడా లేక దెయ్యామా? నేను ఎందుకు భయపడాలని నిలదీశారు. కుమారస్వామిని బెదిరించడం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. రాజకీయాల్లో ఆయన నీడలో తాను పెరగలేదన్నారు. ఆయన పేరు చెప్పుకుని రాజకీయం చేయలేదన్నారు. స్వశక్తితో పైకి వచ్చినట్లు తెలిపారు. ఒకప్పుడు సిద్ధరామయ్య తమ పార్టీ కార్యకర్త, దేవెగౌడ నీడలో పెరిగిన వ్యక్తి అన్నారు. తనను అరెస్టు చేస్తారనే భయం లేదన్నారు. తనకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి బెదిరించాలనే ప్రయత్నాలు చేస్తున్నారని వాటికి భయపడే వ్యక్తి కాదని హెచ్చరించారు.



నివేదికను ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్‌కు అందజేసిన సమితి అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు

భేటీ చేసినా తప్పేనా?

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మార్పును గురించి ఎలాంటి చర్చ జరగలేదని, తమ రాష్ట్రానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తమ పార్టీ నేతలు కలిస్తే విపరీతమైన అర్థాలు కల్పించాల్సిన అవసరం లేదని, భేటీ చేయడంలో తప్పు ఏమి ఉందని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రశ్నించారు. శనివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో వివిధ స్థానాల్లో పార్టీ ఓటమిపై అధ్యయనం చేసేందుకు ఏర్పడిన వి.ఆర్.సుదర్శన్ నేతృత్వంలోని సమితి సిద్ధం చేసిన నివేదికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నేతలను కలిస్తే నానా వదంతులు వ్యాపింపజేయడం మంచిది కాదని హితవు పలికారు. తాము దిల్లీకి వెళ్లినప్పుడల్లా అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి చర్చించడం ఆనవాయితీఅన్నారు. తాను నిత్యం ఆయనతో మాట్లాడుతుంటానని, రాష్ట్రంలో జరుగుతున్న మార్పులను గురించి అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యూట్యూబ్ చూస్తూ దేహాన్ని ముక్కలు చేసి..!

మహాలక్ష్మి హంతకుడి వికృత చేష్ట

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: వయ్యాలికావల్‌లో బ్యూటీషియన్ మహాలక్ష్మి (29)ని సెప్టెంబరు 2న హత్య చేసిన ముక్తిరంజన్ దాస్ శవాన్ని తరలించేందుకు కష్టమని భావించి, దాన్ని ముక్కలు చేశాడని పోలీసులు గుర్తించారు. హత్య అనంతరం యూట్యూబ్‌లో పలు వీడియోలు చూసి మృతదేహాన్ని ముక్కలు ఎలా చేయాలో తెలుసుకున్నాడని చెప్పారు. రిఫ్రిజిరేటర్‌లో శరీర భాగాలను కూరగాయల తరహాలో నిందితుడు పేర్చి, రక్తం మరకలు కనిపించకుండా యాసిడ్‌తో శుభ్రం చేశాడు. హత్య చేసిన తరువాత రోజు ఉదయమే హెబ్బగోడిలోని తన గదికి వెళ్లాడు. అక్కడ ఉన్న సోదరుడికి జరిగిన విషయం చెప్పి, గది ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించాడు. తన బైకుపైనే 1600 కి.మీ. ప్రయాణించి సొంతూరికి చేరుకున్నాడు. జరిగిన విషయాన్ని తల్లికి చెప్పాడు. మహాలక్ష్మి హత్యకు సంబంధించిన వివరాలు బయటకు వస్తాయని చాలా రోజులు వేచి చూశాడు. సెప్టెంబరు మూడో వారంలో హత్య జరిగిన విషయం వెలుగులోకి వచ్చిన అనంతరం అతను భయపడ్డాడు. తన కోసం ఆంధ్ర, పశ్చిమ బెంగాల్, తదితర ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారని తెలుసుకుని, తన ఊళ్లోనే డెత్‌నోట్ రాసి ఉరి వేసుకున్నాడు. మహాలక్ష్మిని ప్రేమిస్తున్న అతను ఒకరోజు అనుమానంతో ఆమె చరవాణి పరిశీలించగా, ఆమెకు వివాహమై, ఒక కొడుకు ఉన్నాడని, వారిద్దరినీ వదిలి ఒంటరిగా ఉంటోందని తెలుసుకుని గొడవపడ్డాడు. ఆమెకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ, మరో యువతితో అతను స్నేహాన్ని పెంచుకున్నాడు. ఆ యువతితోనూ మహాలక్ష్మి గొడవ పడింది. నా భర్తకు విడాకులు ఇస్తానని, వివాహం చేసుకుందాం అని చెప్పింది. తనకు దూరంగా ఉంటే, అత్యాచారం చేశావని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించింది. ఇదే కోపంతో ఆమెపై దాడి చేశాడు. కిందపడి స్పృహకోల్పోయిన ఆమె మొహంపై దిండుతో అదిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

రూ.3 వేలుకు జంట హత్య

మడికేరి, న్యూస్‌టుడే: కుశాలనగర తాలూకా కూడు మంగళూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో జోసెఫ్ (55), వసంత్ (45) అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. గిరీశ్ (29), జోసెఫ్, వసంత్, మోహన్, సంజయ్ స్నేహితులు. ఇరుగు పొరుగు ఇళ్లలోనే ఉండేవారు. రూ.3 వేల నగదు చేబదులుకు సంబంధించి జోసెఫ్, గిరీశ్‌ల మధ్య గొడవలు ఉన్నాయి. ఇదే విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. వారించేందుకు వచ్చిన జోసెఫ్‌పై గిరీశ్ కొడవలితో దాడి చేశాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించిన జోసెఫ్‌పైనా దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. పరారైన నిందితుని కోసం కుశాలనగర గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

మునిరత్న న్యాయనిర్బంధం పొడిగింపు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: అత్యాచారం ఆరోపణలపై అరెస్టయిన రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్నకు రెండు వారాలు న్యాయనిర్బంధానికి పంపిస్తూ చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఆదేశించింది. పది రోజులుగా ఆయన సిట్ అదుపులో ఉన్నారు. కస్టడీ అవధి పూర్తి కావడంతో మునిరత్నను న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. మరో వారం పాటు ఆయనను తమకు అప్పగించాలని వేసుకున్న అర్జీని న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే పక్కకు పెట్టారు. రెండు వారాల పాటు (అక్టోబరు 19) వరకు న్యాయనిర్బంధానికి పంపించాలని ఆదేశించారు. తనకు ఇంటి భోజనాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా, కారాగారం అధికారులకు అర్జీ వేసుకోవాలని సూచించారు. అధికారులు అనుమతి ఇవ్వకపోతే, న్యాయస్థానం ముందుకు రావాలని మునిరత్న తరపు న్యాయవాదులకు న్యాయమూర్తి సూచించారు.

19 మందిపై కేసు నమోదు

బెంగళూరు (శివాజీనగర),: నకిలీ దాఖలాలు ఉపయోగించి రూ.70 కోట్ల విలువైన ఆస్తికి పరిహారాన్ని పొందేందుకు ప్రయత్నించిన 19 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఉమేశ్ అనే వ్యక్తి తన భూములను బీడీఏ జప్తు చేసుకుందని, తనకు, తన కుటుంబ సభ్యులకు పరిహారం ఇవ్వాలని ఉమేశ్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. ఇది ఉమేశ్ భూమి కాదని గోవిందరాజు అనే వ్యక్తి బీడీఏలో ఫిర్యాదు చేశారు. భూస్వాధీన అధికారిణి డాక్టర్ సుధ, సర్వేయర్ పీఎస్ రవిప్రకాశ్‌లు ఆస్తిని పరిశీలించగా మూడ్లప్ప అనే వ్యక్తికి చెందిన 57,498 చ.అడుగుల భూమిని ఉమేశ్, ఇతరులు కబ్జాకు ప్రయత్నించి, నకిలీ దాఖలాలు సృష్టించారని గుర్తించారు. మూడ్లప్ప 1976లోనే మరణించగా, నిందితులు 2021 జనవరి 19న నకిలీ దాఖలాలు సృష్టించి, ఆ భూమిని సొంత చేసుకున్నారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

ఘరానా చోరుడి ఆటకట్టు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: పగటి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రుళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న రఘు అలియాస్ పెప్పి (24) అనే నిందితుడ్ని జ్ఞానభారతి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. రఘువనహళ్లి పరిధి బాలాజీ లేఅవుట్‌కు చెందిన నిందితుడి నుంచి రూ.8.5 లక్షల విలువైన ఆభరణాలు, ఒక బైకు జప్తు చేసుకున్నామని డీసీపీ గిరీశ్ తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో రెండు, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు ఠాణా పరిధిలో ఒక దొంగతనంతో పాటు, నగర పరిధిలో 19 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఇతనితో కలిసి దొంగతనాలకు పాల్పడుతూ, పరారీలో ఉన్న మిథున్, దీపక్, జైదీప్‌ల కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. వీరు ముగ్గురినీ గతంలో రాజరాజేశ్వరినగర ఠాణా పోలీసులు దొంగతనం కేసులో అరెస్టు చేసి కారాగారానికి పంపించారు. బెయిలుపై బయటకు వచ్చి రఘుతో కలిసి దొంగతనాలు చేశారని ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు.

కన్నడ కస్తూరి గుబాళింపునకు అగ్రాసనం

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆకాంక్ష



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

రాయచూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర భాష కన్నడ అగ్రస్థానంలో ఉండాలని, కర్ణాటక కన్నడ మయం కావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆకాంక్షించారు. పరాయి భాషలను గౌరవించాలని, మాతృభాష మనుగడను కోల్పోయేలా అత్యంత ఉదారంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. కన్నడ, సంస్కృతి శాఖ, కన్నడ ప్రాధికార అభివృద్ధి సంయుక్తంగా కర్ణాటక 50 సంభ్రమ కార్యక్రమం, 40 ఏళ్ల క్రితం గోకాక్‌లో జరిగిన భాషా రక్షణ ఉద్యమం నేపథ్యం - ముందడుగుపై శనివారం రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం మైదానంలో సభను నిర్వహించాయి. సీఎం సిద్ధు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని పారంభించారు. ఏ భాష పట్ల అనుచితంగా నడచుకోవద్దని కోరారు. కన్నడలోనే పరిపాలన జరుగుతూ, ఇళ్లలోనూ మాట్లాడితే భాషను రక్షించుకోవడం సాధ్యమవుతుందని సీఎం విశ్లేషించారు. కర్ణాటకలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల వారితో కన్నడలోనే మాట్లాడుతూ, వారు నేర్చుకునేలా ప్రేరణ కలిగించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల మాదిరి భాషా దురభిమానం చూపవద్దని సూచించారు. హైదరాబాద్ నిజాం దీర్ఘకాలికంగా పాలించినందున కలబురగిలో ఉర్దూ, రాయచూరుకు సరిహద్దులో తెలుగు రాష్ట్రాలు ఉన్నందున తెలుగు, మహారాష్ట్ర సరిహద్దుకు బీదర్ జిల్లా దగ్గర్లో ఉండటం వల్ల మరాఠా ప్రభావం కన్పించడం సహజమని తెలిపారు. ఏది ఏమైనా కర్ణాటకలో నివసిస్తున్న ఏడు కోట్ల మంది కన్నడిగులేనని పేర్కొన్నారు. కర్ణాటకంతా కన్నడ కస్తూరి గుబాళించేందుకు ఏడాదిగా సంభ్రమ కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా నవంబరు 1న విధానసౌధ ఎదుట కంచు భువనేశ్వరి మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని వెల్లడించారు. 50 మంది పురుషులు, 50 మంది మహిళలకు పురస్కారాలను ప్రదానం చేస్తామని, చరిత్ర లిఖించిన 50 పుస్తకాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు

1983లో ఎమ్మెల్యేగా గెలిచా..

'1983లో తొలిసారిగా స్వతంత్ర ఎమ్మెల్యే అయ్యా. అప్పటి సీఎం హెగ్డే తనను కన్నడ కావలి సమితి(కాపలా సమితి) అధ్యక్షుడిగా ఉండాలని కోరారు. తాను సాహితీవేత్త కాదని, ఎంఏ కన్నడ చదవలేదని చెప్పా.కన్నడను అగ్రస్థానంలో ఉంచేందుకు బాధ్యత అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఏడాది రెండు నెలల తర్వాత 1984లో పట్టు పరిశ్రమ శాఖ మంత్రి అయ్యాయని' జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. భాష కాపలా సమితి దేశంలో ఎక్కడ లేదన్నారు. అనంతరం ఈ సమితిని కన్నడ అభివృద్ధి ప్రాధికారిగా మార్చారని తెలిపారు. మంత్రిగా పనిచేసినప్పుడు, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సంబంధించి దస్త్రాలపై కన్నడలో సంతకం చేస్తున్నానని, కేంద్రానికి, ఇతర రాష్ట్రాలకు లేఖలు రాసిన సమయంలోనే ఆంగ్లంలో సంతకం చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబరు 1, 1956లో భాషా ప్రాంతం రాష్ట్రంగా మైసూరు రాజ్యం ఆవిర్భవిస్తే, సీఎం దేవరాజ్ అరసు నవంబరు 1, 1973లో అఖండ కర్ణాటక రాష్ట్రంగా మార్చారని గుర్తు చేశారు. 50 ఏళ్ల సంబరాలకు హాజరు కావడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రతి కన్నడిగుడు కర్ణాటక ఏకీకరణ ఉద్దేశాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోకాక్ ఉద్యమంలో పాల్గొన్న శివ శరణప్ప, లింగణ్ణ, సారా గోవిందు, చంద్రకాంత్ బెల్లం, కె.శాంతప్ప, కలీం పాషాను సన్మానించారు. కన్నడ ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తం, మున్సిపల్ అధ్యక్షురాలు నరసమ్మ, మంత్రులు మహదేవప్ప, బోసురాజు, శరణ ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, బసననగౌడ తుర్విహాళ్, బాదర్లి హంపనగౌడ, ఎమ్మెల్సీలు వసంతకుమార్, బసవనగౌడ బాదర్లి, శరణేగౌడ బయ్యాపూరు, చంద్రశేఖర్ పాటిల్, జిల్లా పాలనాధికారి నితీష్, జడ్పీ సీఈవో రాహుల్, ఎస్పీ పుట్ట మాదయ్య, ఆర్‌డీఏ అధ్యక్షుడు రాజశేఖర వేదికను అలంకరించారు.



ఊరేగింపుగా వస్తున్న మహిళలు

'పేదల పొట్ట నింపటమే నేను చేసిన తప్పా'

మాన్వి,న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కేంద్రం ఓర్వలేకపోతోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. వివిధ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, స్వాభిమాన బృహత్ సభ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మహిళలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. తన పై ఏ విధంగానైనా సరే అవినీతి ముద్ర వేసి దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని భాజపా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేవరాజ్ అరసు తర్వాత తానే పూర్తికాలం ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి సేవలందించానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు రాష్ట్రాన్ని దివాలా తీయించారని, ఆ నిందని గ్యారంటీలు అమలు చేస్తున్న తనపై వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయితే ఇన్ని వేల కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేయగలమా అని ప్రశ్నించారు. లాల్‌కృష్ణ అడ్వాణి కుదరదని వెనక్కి పంపిన ఆర్టికల్ 371జేని కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా కల్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన ఎందరో వైద్య, ఇంజినీరింగ్, ఇతర పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారన్నారు. న్యాయస్థానాల కంటే తాను తన ఆత్మ సాక్షిని నమ్ముతానని అందుకు అనుగుణంగానే నడుచుకుంటాను తప్ప అందుకు విరుద్ధంగా నడుచుకోనని స్పష్టం చేశారు. ఇందుకోసం పోరాడతాను తప్ప భాజపాకి బెదిరిపోయి వెనకంజవేసేదే లేదన్నారు. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధంలేని తన భార్యని నిందించటమా తగునా అన్ని ప్రశ్నించారు.



వివిధ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి అభివాదం చేస్తున్న సీఎం మంత్రులు

పాలికెలో అవినీతిపై లోకాయుక్త విచారణ

బళ్లారి, న్యూస్‌టుడే: నగరపాలికె తాగునీటి ప్రాజెక్టులో అక్రమాలపై లోకాయుక్త అధికారులు శనివారం విచారణ నిర్వహించారు. పాలికెలో 2016-17 ఏడాదిలో 14వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్ర ప్రభుత్వ తాగునీటి పథకాన్ని అమలు చేస్తూ, నకిలీ పత్రాలు సృష్టించి రూ.1.55 కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై పలువురు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న లోకాయుక్త పోలీసులు శుక్రవారం పాలికె అధికారులకు వారెంట్ అందజేశారు. శనివారం లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు నేతృత్వంలో అధికారులు పాలికె కార్యాలయం చేరుకొని వివిధ పత్రాలు పరిశీలించారు. 2016-17 ఏడాది మధ్యలో 11 మంది అక్రమాలకు పాల్పడినట్లు అనుమానం ఉందని అధికారులు తెలిపారు. ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరి పాత్ర ఎంతుందో పరిశీలించిన తర్వాత బాధ్యులను అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలికె కార్యాలయంలో తనిఖీలు సాగాయి.


పత్రాలు పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారులు


బళ్లారి గ్రామీణ: అప్పంబావి తుల్జా భవానీకి చీరలతో అలంకారం



బళ్లారి గ్రామీణ: అన్నపూర్ణగా నీలకంఠేశ్వరిదేవి


బళ్లారి గ్రామీణ: దుర్గాదేవిగా రుక్మాదేవి


కారటగి: రత్నగిరిపై అన్నపూర్ణదేవిగా...


హొసపేటె: విశేషాలంకారంలో అంబాభవాని


హొసపేటె: చేనేత కాలనీలో బన్నిమహంకాళి


శ్రీరామనగర్: ప్రత్యేకాలంకారంలో కనకదుర్గాదేవి


సింధనూరు శాంతినగర్‌లో అన్నపూర్ణేశ్వరిగా..

అన్నపూర్ణేశ్వరి.. క్షుద్బాధనివారిణి

వాడవాడలా శరన్నవ శోభ

దసర శరన్నవ రాత్రుల్లో భాగంగా మూడో రోజు శనివారం బళ్లారి, విజయనగర జిల్లాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అర్చకులు అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బళ్లారి నగరం, గ్రామీణం, హొసపేటె, కంప్లి, కారటగి, సింధనూరు, శ్రీరామనగర్, గంగావతి, సిరుగుప్ప తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు, ప్రవచనాలు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. –న్యూస్‌టుడే బృందం


బళ్లారి గ్రామీణ: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


బళ్లారి గ్రామీణ: ఆకట్టుకున్న కళాకారుల నృత్యం


సింధనూరు: శివపంచాయతన క్షేత్రంలో కుంకుమార్చన


కంప్లి: బసవేశ్వర ఆలయంలో లక్ష్మీ సరస్వతి విగ్రహాలు


సిరుగుప్ప: మహాంకాళి అలంకారంలో..


సిరుగుప్ప: పట్టాభిరామ ఆలయంలో గాయత్రీదేవిగా..


బళ్లారి: కృష్ణానగర క్యాంపు ఆలయంలో అన్నపూర్ణగా..


బళ్లారి: సిద్దేశ్వర మహాస్వామి మఠంలో రుద్రాభిషేకం


బళ్లారి: బెంకి మారెమ్మకు ప్రత్యేకాలంకారం


బళ్లారి: విశేషాలంకారంలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి

ఇల్లు కూలింది.. కూరుకుపోయాడు

శ్రమించి రక్షించిన గ్రామస్థులు


మట్టిలో ఇరుక్కున్న ప్రకాశ్‌ను బయటకు తీస్తున్న గ్రామస్థులు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకాలోని ఢణాపురలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు కూలిపోవడంతో అందులో నివసిస్తున్న ప్రకాశ్ అనే వ్యక్తి కూరుకుపోయి గాయపడిన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పాత బండేశ్వర గుడి వద్ద ఉంటున్న ప్రకాశ్ శనివారం వేకువజామున 5.30 గంటలకు నిద్రలేచారు. వాకింగ్‌కు బయలుదేరుతుండగా రాత్రి వర్షానికి నానిన ఇంటి పైకప్పు ఆయనపై కూలింది. గమనించిన ప్రకాశ్ అక్క భాగ్యలక్ష్మి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. రాళ్లు, మట్టిలో కూరుకుపోయిన ప్రకాశ్ కొంత సేపు కనిపించలేదు. చివరికి ఆయనను గుర్తించి పారలతో మట్టి తొలగించి బయటకు తీసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రకాశ్ వెన్నెముక, కాలికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని బాధితుడు ప్రకాశ్ కుటుంబ వివరాలు తెలుసుకుని తనవంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత ఇల్లు కావడంతో వర్షానికి తడిసి కూలిందని అన్నారు. గ్రామంలోని సముదాయ భవనంలో ప్రకాశ్ కుటుంబం తాత్కాలికంగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి శివరాజ్ తంగడగి ప్రకాశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు.


జాగ్రత్తగా తీస్తున్న వైనం..

మెలకువలతోనే అధిక దిగుబడి సాధ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: కంది పంటకు వ్యాపించిన తెగుళ్లను గుర్తించి, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలతో మందులు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారి దేవరాజ రైతులకు సూచించారు. కురుగోడు తాలూకా రైతు సంపర్క కేంద్రం వ్యాప్తిలోకి వచ్చే కురుగోడు సమీపంలో సాగు చేసిన కంది పంటను ఆయన పరిశీలించి కర్షకులకు పలు మెలకువలు తెలిపారు. కురుగోడు తాలూకాలో వర్షాధారం, నీటిపారుదల కింద 390 హెక్టార్లలో కంది పంట సాగైందని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన కంది పంట బాగా వచ్చిందన్నారు. రసాయన ఎరువులను తక్కువగా వాడాలని, ప్రస్తుతం పూత దశలో ఉండటంతో తెగుళ్లు వ్యాపించే అవకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు. అన్నదాతలు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు.


కంది పంటను పరిశీలిస్తున్న రైతులతో వ్యవసాయ అధికారి దేవరాజు

వైద్యులకు సహనం ప్రధానం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: వైద్య వృత్తిలో ఎలాంటి సందర్భంలోనైనా వైద్యులు సహనం కోల్పోకుండా రోగులకు సేవలందిచడం ఎంతో ముఖ్యమని స్థానిక ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప అన్నారు. శనివారం ఆయన హొళల్కెర ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన తాలూకా ఆరోగ్య రక్షణ సమితి సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోనే సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇక్కడ ఆసుపత్రిలో రోగులకు ఉత్తమ వైద్య సేవలందించాలని సూచించారు. రోగులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. వైద్యులను దేవుడితో సమానంగా చూసే సమాజం మనదని గుర్తుంచుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రేణుప్రసాద్, తాలూకా అధికారి డాక్టర్ రేఖ, పురపాలిక కమిషనర్ రేణుక, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు వినయ్ సజ్జన్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రప్ప

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రైల్వేస్టేషన్ పరిధిలో 24 ఏళ్ల యువతి అదృశ్యంపై హొసపేటె రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు రైల్వే ఎస్సై తెలిపారు. యువతి 157 సెం.మీ. ఎత్తు, కోల ముఖం, సాధారణ శరీరాకృతి, గోధుమ రంగుతో ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గుర్తింపుకార్డుల రద్దుకు వినతి

నకిలీ భవన నిర్మాణ కార్మికుల గుర్తింపుకార్డులను రద్దు చేయాలని సేవలాల్ సంఘం కోరింది. శనివారం సంఘం సభ్యులు గంగావతిలో కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్‌కు ఈమేరకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. తాము కట్టడ కార్మికులం అంటూ పలువురు గుర్తింపుకార్డులు పొందారన్నారు. దీనివల్ల నిజమైన కార్మికులకు ప్రభుత్వ సదుపాయాలు అందడం లేదన్నారు. తమ పిల్లలకు వెంటనే ఉపకార వేతనాలు చెల్లించాలని, గర్భిణులకు ప్రసూతి భత్యం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెంకటేశ్ మేస్త్రి, పాండునాయక్, శివప్ప, శివప్పరాథోడ్ పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, గంగావతి



దసరాకు పుట్టినిల్లు విజయనగర సామ్రాజ్యం

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా మన ప్రాంతానిదే. విజయనగర సామ్రాజ్య రాజులు అప్పట్లో ఈ వేడుకలకు తెర లేపారు. ఇది చరిత్ర. మైసూరు ప్రాంతీయులు దీన్ని అనుకరించి మైసూరు దసరాగా మార్చారని కొప్పళ జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడిగి అన్నారు. శనివారం రాత్రి సింధనూరు దసరా వేడుకను స్థానిక ఆర్జీఎం మైదానంలో ఆయన ప్రారంభించారు. రెండో రోజు 'సాంస్కృతిక సింధనూరు దసరా'గా మలిచారు. ఈ సందర్భంగా మంత్రి తంగడిగి మాట్లాడుతూ ఇది నాడహబ్బ అని, అంటే రాష్ట్ర పండగ అన్నారు. అందుకే ఈ ఏడాది నుంచి కల్యాణ కర్ణాటకకు సింధనూరు కేంద్రంగా ప్రభుత్వం ఉత్సవానికి తెర తీసిందన్నారు. ఈ తొమ్మిది రోజుల దసరా ఉత్సవాల్లో వక్తలు ప్రజలకు రాష్ట్రం గురించి తెలియని విషయాలు విపులంగా వివరించాలని కోరారు. తొలుత ఉత్సవ సమితి గౌరవ పెద్దలు బాదర్లి హంపనగౌడ, కె.విరుపాక్షప్ప, నాడగౌడ, తహసీల్దారు తదితరలు ప్రయాణ ప్రాంగణం సమీపంలోని అంబాదేవి గుడి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తలపై పెట్టుకుని ఆర్జీఎం మైదానం వేదిక వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రముఖ జానపద గాయకుడు గురురాజ్ హొసకోటి ఆలాపన సభికులను ఉల్లాసపరిచింది.


అంబాదేవి ఉత్సవ విగ్రహాన్ని వేదిక వద్దకు ఊరేగింపుగా తెస్తున్న పెద్దలు


డోలు వాయించి ప్రారంభిస్తున్న మంత్రి తంగడిగి

'సీఎం కుర్చీ ఖాళీగా లేదు'

హొసపేటె, న్యూస్‌టుడే: 'దళితులు ముఖ్యమంత్రి కావాలన్న డిమాండు ముందునుంచి ఉంది. ఇప్పుడా దీనిపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సీఎం కుర్చీ ఖాళీగా లేదని' సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజణ్ణ పేర్కొన్నారు. బీడీసీసీ బ్యాంకులో శనివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య కొనసాగుతున్నారని, ఆ స్థానం ఖాళీగా ఉంటేనే చర్చలు చేయాలని నొక్కిచెప్పారు. మాజీ మంత్రి, జేడీఎస్ నాయకుడు జి.టి.దేవేగౌడ సీఎంను వెనకేసుకొచ్చి మాట్లాడటం ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సిద్దరామయ్య జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. అది ఓర్వలేక భాజపా నాయకులు ప్రభుత్వానికి, పార్టీకి మసిపూసే పనిచేస్తున్నారని దుయ్యబట్టారు.

తుంగభద్రకు పెరిగిన వరద

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న వరద ప్రమాణం శనివారం పెరిగింది. రెండు రోజులుగా స్థానికంగా, జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయానికి వస్తున్న వరద ప్రమాణం 14,712 క్యూసెక్కులకు పెరిగింది. అన్ని ప్రధాన కాలువలు కలిపి మొత్తం 13,625 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1632 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తిగా నిండటానికి మరో అడుగే ఖాళీ ఉంది.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బళ్లారి, న్యూస్‌టుడే: సమాజంలో సుస్థిర జీవనం, రక్షణ, సాధికారత కోసం చట్టాలపై మహిళలు కచ్చితంగా అవగాహన పెంచుకోవాలని జిల్లా కుటుంబ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సిద్ధలింగ ప్రభు సూచించారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ, రాష్ట్ర, జిల్లా సేవా ప్రాధికార సంస్థలు, బళ్లారి న్యాయవాదుల సంఘం, మహిళా-శిశు అభివృద్ధి సంక్షేమ శాఖలు కలిసి జడ్పీ నజీర్ సభా భవనంలో ఏర్పాటు చేసిన 'విధాన్ సే సమాధాన్ అభియాన్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వనితలు రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు వారిపై లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం విచారకరమన్నారు. స్త్రీలపై అత్యాచారం, వరకట్న వేధింపులను పూర్తిగా నిషేధించాలన్నారు. జిల్లా న్యాయసేవా ప్రాధికార కార్యదర్శి రాజేశ్ ఎన్.హొసమనె మాట్లాడుతూ వివాదాలు తలెత్తినప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఏవిధంగా ఫిర్యాదులు చేయాలని, కోర్టులను ఎలా సంప్రదించాలో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామీణ, పట్టణ మహిళలకు చట్టాలు, సురక్షితపై అవగాహన కల్పించాలని కోరారు. న్యాయవాదులు విజయలక్ష్మి, శివలీల వివిధ చట్టాల గురించి వివరించారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.రామబ్రహ్మం, మహిళ, శిశు అభివృద్ధి సంక్షేమశాఖ ఉపనిర్దేశకులు విజయకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సిద్ధలింగ ప్రభు

సహకార సంఘాలు చాలా అవసరం


మాట్లాడుతున్న సహకార మంత్రి రాజణ్ణ

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రతి గ్రామ పంచాయతీకి ఓ సహకార సంఘం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజణ్ణ పేర్కొన్నారు. బళ్లారి జిల్లా సహకార కేంద్ర (బీడీసీసీ) బ్యాంకు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన తుంగభద్ర రైతుల సంక్షేమాభివృద్ధి సంఘం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు, మూడు పంచాయతీలకు ఓ సహకార సంఘం ఉందన్నారు. దీనివల్ల రైతులు చాలా దూరం వెళ్లి రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అదే పంచాయతీకో సహకార సంఘం ఏర్పాటు చేస్తే వారికి ఎంతో వెసలుబాటుగా ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వ స్థాయిలో విధి విధానాలు రూపొందిస్తున్నామని వివరించారు. సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేలు హెచ్.ఆర్.గవియప్ప, డాక్టర్ ఎన్.టి.శ్రీనివాస్, లతామల్లికార్జున, నారా భరత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భీమానాయక్, బ్యాంకు అధ్యక్షుడు గుండుమణుగు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు దారుకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

స్వాభిమాన సభలో మంత్రికి సత్కారం



మాన్వి, న్యూస్‌టుడే: పట్టణంలో స్వాభిమాన సభ నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి ఎన్.ఎస్.బోసురాజును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వేదికపై ప్రశంసలతో ముంచెత్తారు. సభను విజయవంతంగా నిర్వహించిన క్రమంలో సీఎం అభినందించి మంత్రిని ఘనంగా సత్కరించారు.

మంత్రి బోసురాజును సత్కరిస్తున్న సీఎం ➤

హిట్నాళలో సంజీవని కార్యశాల ప్రారంభం

తాలూకాలోని హిట్నాళ గ్రామంలో ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్ సంజీవని కార్యశాలను ప్రారంభించారు. స్వయం సహాయక మహిళా సంఘాలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలు జీవనోపాధితో ఆర్థికంగా బలపడేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ బండిహాళ పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, గంగావతి



అబ్బో.. ఏం వాన

- దెబ్బతిన్న పంటలు, ఇళ్లు
- నారిహళ్లి జలాశయం గేటు ఎత్తివేత



బళ్లారి: రంగమందిరం వంతెన కింద ఇదీ పరిస్థితి



హగరి నదిలో ప్రవాహం

బళ్లారి, న్యూస్‌టుడే: ఉమ్మడి బళ్లారి జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. కొన్ని రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు కరుణ చూపడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నా, సామాన్య జనం అబ్బో.. ఇదేం వాన మేమెప్పుడు చూడలేదనడం వినిపించింది. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు ఏకధాటిగా వాన కురిసింది. సండూరు తాలూకాలో అత్యధికంగా 57.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. నారిహళ్లి జలాశయం పూర్తిగా నిండిపోవడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటికి కిందికి విడుదల చేశారు. దిగువన సాగు చేసిన పంటలు జొన్న, మొక్కజొన్న, సజ్జ ముంపునకు గురవడంతో రైతులు లబోదిబోమన్నారు. అధికారులు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. వానలకు సండూరు తాలూకాలో ఏడు, బళ్లారి తాలూకాలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బళ్లారి తాలూకా శంకరబండ వద్ద వాగు ప్రవాహానికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి మధ్యలో చెట్టు పట్టుకొని ప్రాణాలు నిలుపుకొన్నాడు. స్థానికులు ఆయనను గుర్తించి కాపాడి బళ్లారిలోని బీఎంసీఆర్‌సీకి తరలించారు.



నారిహళ్లి జలాశయం నుంచి విడుదల చేసిన నీరు

చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత ఆయన చనిపోవడం బాధాకరం. వర్షపు నీరు తాగి మృతి చెందారా లేదా వేరే కారణాలు ఏమైనా ఉన్నాయో తెలియకపోవడంతో వివరాలు నమోదు చేసుకోలేదని అధికారులు తెలిపారు. తాలూకాల వారీగా బళ్లారిలో 31.4 మి.మీ., సండూరు 57.4, సిరుగుప్ప 16.9, కురుగోడు 27.7, కంప్లి 51.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ అధికారులు వెల్లడించారు.

విజయనగరను ముంచెత్తిన వరుణుడు

హొసపేటె : వరుణుడు విజయనగర జిల్లాపై విరుచుకుపడ్డాడు. కుండపోతతో హొసపేటె, కూడ్లిగి తాలూకాలు విలవిల్లాడాయి. వాగులు పొంగి పంటలు, రహదారులు మునిగిపోయాయి. అరటి, చెరకు తోటలకు భారీ నష్టం వాటిల్లింది. కూడ్లిగి తాలూకాలో పలు వాగులు పోటెత్తాయి. ఉదయం పిచారహట్టి వాగుపైన వెళుతున్న ఓ సరకు లారీ కొట్టుకుపోయింది. అందులో ఉన్న సుమారు పదిమంది ప్రయాణికులు వెంటనే కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. హొసపేటె శివారు రాయచెరువు ప్రాంతంలో వేసిన అరటి, చెరకు పంటలు ధ్వంసమయ్యాయి. జరిగిన నష్టాన్ని రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది అంచనా వేస్తున్నారు.



కారటగిలోని జేపీనగర్‌ను ముంచిన వాన

కారటగి వీధులు జలమయం

కారటగి, న్యూస్‌టుడే: భారీ వర్షానికి కారటగి వీధులు జలమయమయ్యాయి. శ్రీదేవి ఆలయం వెనుక వీధిలో వర్షపు, మురుగునీరు కలిసి ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. 11వ వార్డు వలీసాబ్ దర్గా, సీబీఎస్ నగర్, పన్నాపుర రోడ్లు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లల్లోకి నీరు చేరడంతో బయటకు పంపడానికి జనాలు శ్రమించారు. పట్టణంలో 85.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



సండూరు తాలూకాలో పడిపోయిన ఇల్లు



ముంపునకు గురైన పంటలో రైతు



ఇంటిలోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ



హొసపేటె: పిచారహట్టివద్ద వాగులో కొట్టుకుపోతున్న రవాణా లారీ



హొసపేటె: రాయచెరువు ప్రాంతంలో మునిగిన అరటిపంట

'గాలి ప్రభావం ఉండదు'

హొసపేటె, న్యూస్‌టుడే: గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారికి వచ్చినంత మాత్రానా ఇక్కడి రాజకీయాల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం హొసపేటెలో విలేకరులతో మాట్లాడారు. బళ్లారిలో కాంగ్రెస్ బలోపేతంగా ఉందన్నారు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ, మూడు నెలల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చిన తర్వాత సండూరు సీటునూ హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. గత 14 ఏళ్లలో బళ్లారిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని గాలి జనార్దన్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తిప్పికొట్టారు. బళ్లారి, విజయనగర జిల్లాలో భాజపా పూర్తిగా చతికిల పడిందని ఎద్దేవా చేశారు.

9 నుంచి లోకాయుక్త విజ్ఞప్తుల స్వీకరణ

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లాలో 9వ తేదీ నుంచి ప్రజల నుంచి వివిధ సమస్యలపై విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని హొసపేటె లోకాయుక్త పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. 9న కూడ్లిగి, 15న కొట్టూరు, 22న హరపనహళ్లిలో జరిగే స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు అందులో కోరారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేశ్

గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకు కృషి

కంప్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు తదితర కనీస వసతులు కల్పించి కంప్లి విధానసభ క్షేత్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే గణేశ్ అన్నారు. తాలూకాలోని సణాపుర, ఎమ్మిగనూరు గ్రామాల్లో కల్యాణ కర్ణాటక ప్రదేశ సముదాయ నైర్మల్య ఘటక పనులకు శనివారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 20 ఫిర్కాల్లో వసతి పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో కంప్లి ఫిర్కా ఉందన్నారు. ప్రస్తుత విద్యా ఏడాదిలోనే ఈ పాఠశాలలు ప్రారంభమవుతాయని చెప్పారు. త్వరలో విద్యార్థుల ప్రవేశ ప్రక్రియ చేపడతామన్నారు. బడి భవన నిర్మాణం కోసం తాలూకాలోని హంపా దేవనహళ్లి వద్ద 10 ఎకరాల స్థలం చూడడం జరిగిందన్నారు. అంతవరకు కంప్లిలోని అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతుందన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం : ముఖ్యమంత్రి

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కేంద్రం ఓర్వలేకపోతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, స్వాభిమాన బృహత్ సభ కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి బహిరంగ సభలో మాట్లాడారు. మహిళలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. విధంగానైనా అవినీతి ముద్ర వేసి దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని భాజపా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేవరాజ్ అరసు తర్వాత తానే పూర్తి కాలం ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి సేవలందించామని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు రాష్ట్రాన్ని



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

దివాళా తీయించారని, ఆ నింద గ్యారంటీలు అమలు చేస్తున్న తనపై వేస్తున్నారని ఆరోపించారు. ఖజానా ఖాళీ ఐతే ఇన్ని వేల కోట్లతో అభివృద్ధి పనులు చేయగలమా అన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలుబెట్టుకున్నానన్న సంతృప్తి తనకుందన్నారు. న్యాయస్థానాల కంటే తన ఆత్మసాక్షిని నమ్ముతానని, అందుకు అనుగుణంగానే నడుచుకుంటాను తప్ప అందుకు విరుద్ధంగా వ్యవహరించనని స్పష్టం చేశారు. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని తన భార్యను నిందించడం తగునా అన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ స్వాగతోపన్యాసం చేశారు. మంత్రి బోసురాజు ప్రస్తావికంగా మాట్లాడారు. మంత్రులు మునియప్ప, మహాదేవప్ప, సతీష్ జార్ఖిహొళి, శరణప్రకాష్ పాటిల్, శివరాజ్ తంగడిగి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ, బసనగౌడ దద్దల్, బసవనగౌడ తుర్వీహాళ్, బాదర్లి హంపనగౌడ, ఎమ్మెల్సీలు బాదర్లి బసవనగౌడ, శరణేగౌడ బయ్యాపూర్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ సైడ్ లైట్స్

ముఖ్యమంత్రితో సహా అందరూ రవిబోసురాజు పేరు ప్రస్తావించారు. ఈ స్థాయి సభ తాలూకాలో తామెప్పుడూ చూడలేదని మంత్రులు మహదేవప్ప, మునియప్ప పేర్కొన్నారు. ఏర్పాట్లను మంత్రులు కొనియాడారు. సీఎం మాట్లాడేందుకు మైకు వద్దకు వచ్చిన 10 నిమిషాల వరకు ప్రజలు కేకలు, ఈలలతో సభ మారుమోగించారు. ముఖ్యమంత్రి 20 నిమిషాలు మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సభ జరిగింది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సత్కరించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం, మంత్రులు



సభకు హాజరైన ప్రజలు

సిద్ధరామయ్యకు వినతుల వెల్లువ



ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు వచ్చిన క్రమంలో వివిధ సంఘ సంస్థల నిర్వాహకులు వినతి పత్రాలను అందించారు. భాజపా మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవాట్ ఆధ్వర్యంలో జనతాదళ్ మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, రైతు సంఘం నాయకుడు చామరస్ మాలీపాటిల్, కర్ణాటక రక్షణ వేదిక ప్రతినిధులు డి.బసనగౌడ, గారపాటి రామకృష్ణ, కమ్మవారి సంఘం, వర్గీకరణ విషయమై దళిత సంఘాల నాయకులు వినతి పత్రాలు అందించారు. తుంగభద్ర ఎడమ కాలువ సమస్యను పరిష్కరించాలని, నవలి జలాశయాన్ని నిర్మించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని వినతి పత్రాలు అందాయి.



హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు



మాట్లాడుతున్న ఉపకులపతి మునిరాజు

పరిశోధనలపై దృష్టి సారించండి

బళ్లారి, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ సీటు పొందడానికి విద్యార్థులు కఠినశ్రమ చేసి మంచి కళాశాలలో చేరారని, పరీక్షల్లో మార్కులే కాకుండా పరిశోధనలపై దృష్టి పెట్టి దేశ, అంతర్జాతీయ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు పొందాలని బళ్లారి, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి మునిరాజు అన్నారు. బళ్లారి రావ్‌బహద్దూర్ వై.మహబలేశ్వరప్ప సాంకేతిక మహావిద్యాలయంలో శనివారం నవసంగమం పేరుతో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో జాగ్రత్తగా ఉండాలని, ఈ నాలుగేళ్ల చక్కటి ప్రణాళికతో చదువుకొని మంచి ఉద్యోగాలు తెచ్చుకోవాలన్నారు. గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. దేశాభివృద్ధికి శ్రమించాలన్నారు. వీరశైవ విద్యావర్ధక సంఘం మాజీ కార్యదర్శి కొట్రప్ప మాట్లాడుతూ స్నేహితులకు విలువ ఇస్తూనే జీవితంలో అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి శ్రమించాలన్నారు. కళాశాలలోని ప్రయోగశాలలు, గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. వీవీ సంఘం ఉపాధ్యక్షుడు జానెకుంటె బసవరాజ్ కళాశాల ప్రాముఖ్యత, పూర్వ విద్యార్థుల సాధనల గురించి వివరించారు. కళాశాల ప్రధానాచార్యులు హనుమంతరెడ్డి కళాశాలలో లభించే కోర్సుల గురించి తెలిపారు. ఉప ఆచార్యులు డా.సవితా సూనూళి, చెన్నగౌడరు, సుమంగళ, మల్లికార్జున కోరి నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ



మాట్లాడుతున్న నాగలక్ష్మీ

హొసపేటె, న్యూస్‌టుడే: మీ సేవలను గౌరవపూర్వకంగా వినియోగించుకుంటామని నియామకం సమయంలో చెప్పిన ప్రభుత్వం నేడు వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.నాగలక్ష్మి మండిపడ్డారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల జిల్లా సమ్మేళనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి పథకం అమలుకు కార్యకర్తల సేవలను వాడుకుంటోందని, రెండు గంటలే అని చెప్పి 12 గంటలు పనిచేయిస్తోందని దుయ్యబట్టారు. తగిన జీతాలు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. కార్మికులు, మహిళల సంక్షేమాలను విస్మరిస్తున్న ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఆశా కార్యకర్తల సంక్షేమానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ సర్వేక్షణ అధికారి డాక్టర్ షణ్ముఖనాయక్, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు శాంత, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్, ఉపాధ్యక్షురాలు గీత, కార్యదర్శి గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత పునీత్‌రాజ్‌కుమార్ కూడలి నుంచి వేదిక వరకు ఊరేగింపు నిర్వహించారు.

ఉపగ్రహాల తయారీలో భారత్ భేష్



వస్తు ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే ఉపగ్రహాల తయారీలో మన దేశానికి ఎవరూ సాటి రారని ఇస్రో బెంగళూరు శాస్త్రవేత్త డి.ఆర్.వీరేశ్ అన్నారు. స్థానిక ప్రౌఢ దేవరాయ ఇంజినీరింగ్ కళాశాల, ఇస్రో యు.ఆర్.రావ్ ఉపగ్రహ కేంద్రాలు కలిసి శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన 'ప్రపంచ బాహ్యాకాశ సప్తాహ-2024' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాహ్యాకాశం గురించి విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని ఇస్రో ఆధ్వర్యంలో 10 వరకు అన్ని జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇస్రో నుంచి ఇప్పటి వరకు 97 రాకెట్, 127 ఉపగ్రహాలను నింగిలోకి పంపారన్నారు. సాంకేతిక రంగం చాలా అభివృద్ధి చెందిందని, కొత్త ఆవిష్కారాలపై ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. గూగుల్ బదులుగా భువన్, జీపీఎస్ బదులుగా నావిక్ యాప్‌లను వాడాలని కోరారు. శాస్త్రవేత్తలు ఫర్హాన్ తబస్సుమ్, అరుణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బళ్లారి వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు గురుబసవరాజ్, కళాశాల అధ్యక్షుడు కరిబసవరాజ్ బాదామి, ప్రధానాచార్యుడు యు.ఎం.రోహిత్, సహాయక ప్రధానాచార్యురాలు పార్వతి, మంజుల, ఇందిరా, మధ్వరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన వస్తుప్రదర్శన ఆకట్టుకుంది.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

05-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.96
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,865	3,935
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,625	9,556
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	53.213

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు



రాచరికపు హోదాను తెలిపే తలపాగా



ప్యాలెస్ ఆవరణలో రాజలాంఛనాలతో ప్రదర్శనగా వెళుతున్న వందిమాగధులు

తలపాగా.. గిరాకీ బాగా



తలపాగా తయారీలో నిపుణుడు నందన్‌సింగ్

మైసూరు, న్యూస్‌టుడే: మైసూరు పేరు వినగానే రాజులు, ప్యాలెస్‌లు, వారి దుస్తులు, ఆభరణాలతో పాటు తలపాగాలూ గుర్తుకు వస్తాయి. నాల్వడి కృష్ణ రాజ ఒడెయరు మొదటిసారిగా విలక్షణమైన తలపాగాను ధరించారు. అదే తీరును ఆయన వద్ద దివాన్లుగా పని చేసేవారు కొనసాగించారు. ప్రతిసారీ తలకు పాగా చుట్టే బదులుగా, ముందుగా సిద్ధం చేసిన పాగాను టోపీలా ధరించేందుకు ఇది అనువుగా ఉంటుంది. అప్పటి నుంచి మైసూరు తలపాగాలను ధరించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. మైసూరు పేటా (మైసూరు తలపాగా) తయారీని ప్రతి ఒక్కరూ తయారు చేయడం సాధ్యం కాదు. సాధారణ పేటానే మైసూరు తలపాగాగా విక్రయిస్తుంటారు. ప్రతి ఖాదీ భండార్‌లలో మైసూరు తలపాగాలు విక్రయానికి ఉంటాయి. సాధారణ తలపాగా రూ.300కు లభిస్తుండగా, ప్రత్యేకంగా పట్టు, ముత్యాలతో చేసిన తలపాగాలు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల ధర పలుకుతాయి. దసరా సమయంలో నగరానికి వచ్చే పర్యాటకులు ఎక్కువ మంది తలపాగాలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారని వీటి తయారీ నిపుణుడు నందన్‌సింగ్ తెలిపారు. మైసూరు పట్టు, మైసూరు బనారస్ చీరలతోనే తలపాగా తయారీ ఉంటుంది. వీటిని ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తుంటామని చెప్పారు. ఈ తలపాగాకు గండభేరుండ లాంఛనం, ఇతర చిహ్నాలను అమర్చుతామన్నారు. ప్రధాని మోదీ కూడా ఇష్టపడి ఒక తలపాగా చేయించుకున్నారు. ఈ తలపాగా ధరించడం, ఒక హోదాకు ప్రతీక. శరన్నవరాత్రుల సమయంలో ప్యాలెస్, ఇతర ప్రాంతాల్లో ఈ తలపాగాలను ధరించి సంచరించేవారు ఎక్కువగా కనిపిస్తుంటారు.

రాచనగరి వీధుల్లో..

టాంగాలో సంచారం



టాంగాల్లో ప్రయాణిస్తున్న పర్యాటకులు

మైసూరు, న్యూస్‌టుడే: రాచనగరిలో ఒకప్పుడు శ్రీమంతులు టాంగాల్లోనే ప్రయాణించేవారు. కొందరు తమ నివాస ఆవరణాల్లో గుర్రాలను పెంచుకునే వారు. మరికొందరు బాడుగ టాంగాల్లోనే ప్రయాణించేవారు. శతాబ్దం క్రితం వరకు శ్రీమంతులు గుర్రపు బగ్గీలనే ఎక్కువగా ఉపయోగించేవారు. శరన్నవరాత్రులను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ పాతిక టాంగాలను ప్రత్యేకంగా సిద్ధం చేసింది. శనివారం ఉదయం పాతిక జంటలు, సంప్రదాయక దుస్తులు ధరించి టౌన్ హాల్ నుంచి నగరంలోని ప్రముఖ ప్రాంతాలు, వీధుల్లో ఈ టాంగాల్లో సంచరించారు. మైసూరు, శివమొగ్గ, హాసన, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి మైసూరుకు చేరుకుని, తమ పేర్లను మొదటిగా నమోదు చేసుకున్న వారికి శనివారం అవకాశం కల్పించారు. టాంగా ఎక్కడానికి వచ్చిన దంపతులకు పురాతత్వశాఖ అధికారులు స్వాగతం పలికారు. పర్యటనకు ముందుగా వారు సంచరించే ప్రాంతాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. రంగాచార్యులు పురభవన (టౌన్‌హాల్), పెద్ద గడియార గోపురం, 10వ చామరాజేంద్ర కూడలి, అంబావిలా ప్యాలెస్, నాల్వడి కృష్ణ రాజ ఒడెయరు కూడలి, ల్యాన్స్‌డౌన్ కట్టడం, జగన్‌మోహన ప్యాలెస్, పరకాల మఠం, శేషాద్రి హౌస్-వాణిజ్య పన్నుల కార్యాలయం, జిల్లాధికారి పాత కార్యాలయం, క్రాఫర్డ్ హాల్, హోటల్ మెట్రోపోల్, మైసూరు రైల్వే జంక్షన్, కృష్ణరాజేంద్ర ఆసుపత్రి కూడలి, మైసూరు వైద్య కళాశాల, ఆయుర్వేద ఆసుపత్రి, కావేరి ఎంపోరియం, గాంధీకూడలి నుంచి చివరిగా టౌన్‌హాల్ చేరుకోవడంతో టాంగా పర్యటన ముగిసింది.



మైసూరు తలపాగా ధరించి, తమ భార్యలతో కలిసి కూర్చున్న పర్యాటకులు

ఒకే ఆలయంలో నవదుర్గలు



గర్భగుడిలో ఓవైపు కన్పిస్తున్న ముగ్గురు దుర్గలు

హావేరి, న్యూస్‌టుడే: యాలకుల నగరి హావేరిలో శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఒకే గర్భగుడిలో తొమ్మిది అవతారాల్లో ఉన్న నవదుర్గల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడు వైపులా మూడు చొప్పున విగ్రహాలు ఉంటాయి. గురువారం శైలపుత్రి, శుక్రవారం బ్రహ్మచారిణి, శనివారం చంద్రఘంట అవతారాలకు పూజలు చేశారు. నేడు (ఆది) కూష్మాండ అవతారంలో, తదుపరి రోజుల్లో స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అవతారరూపిణులకు పూజలు చేయనున్నారు. నిత్యం సాయంత్రం కుంకుమ, ఇతర పూజా ద్రవ్యాలతో అమ్మవార్లకు అభిషేకం చేసి దాన్నే ప్రసాదంగా ఇస్తున్నారు. ఈ ఆలయాన్ని 1905లో నిర్మించగా, ఇక్కడి ఆవరణలో 38 వేర్వేరు దేవతామూర్తులు, నవగ్రహాలకు అనుగుణంగా తొమ్మిది వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఆలయాన్ని దేవి పంచాయత్ అని కూడా స్థానికులు పిలుస్తారు.

కరావళి కర్ణుడీతడు





గ్రహాంతరవాసుల వేషధారణలో రవి కటపాడి

ఉడుపి, న్యూస్‌టుడే: ఉడుపి సమీపంలోని కటపాడికి చెందిన రవి భవన నిర్మాణ పనులు చేసుకునే కూలీ కార్మికుడు. చిన్నతనం నుంచి కళలు, విచిత్ర వేషధారణ అంటే ఆయనకు ప్రాణం. అలా వేషధారణ చేసుకునే ప్రతిసారీ నగదు, కానుకలు దండిగా వస్తుంటాయి. అలా తనకు ఇప్పటి వరకు వచ్చిన రూ.కోటి నగదును ఆయన పేదలకు దానం చేసి కరావళి (తీర ప్రాంత) కర్ణునిగా గుర్తింపు దక్కించుకున్నారు. పదేళ్లుగా ఆయన ఏటా కృష్ణాష్టమి, వినాయకచవితి, దసరా సమయంలో తడవకు మూడు రోజుల చొప్పున పాటు ఆయన విచిత్ర వేషధారణతో స్థానికులను అలరిస్తూ వస్తున్నారు. విచిత్ర వేషధారణతో పాటు గతంలో అవతార్, డార్క్ అలైట్ (2021), రాక్షసుడు (2022), సిపోక్ (2023) వేషధారణతో విద్యార్థులు, స్థానికులు, కళాభిమానులను అలరించారు. ఒకసారి వేషధారణ చేస్తే కనీసం రూ.5 లక్షల నగదు విరాళాలు, ప్రోత్సాహం, బహుమతుల రూపంలో వస్తుంది. ఈ ఏడాది నలుగురు బాలల చికిత్సకు అందిస్తున్నానని చెప్పారు. ఈయన విషయం తెలుసుకున్న అమితాబ్ కొన్నేళ్ల క్రితం తాను నిర్వహిస్తున్న కౌన్‌బనేగా కరోడ్‌పతి కార్యక్రమానికి ఆహ్వానించి, సత్కరించారు.

రూ.1.35 కోట్ల పరిహారం ఇవ్వండి

మంగళూరు, న్యూస్‌టుడే: కొట్వార కూడలిలో 2018 మే 18న మరణించిన మహేశ్ భట్ కుటుంబ సభ్యులకు రూ.1.35 కోట్ల పరిహారాన్ని ఇవ్వాలని మంగళూరు ఒకటో అదనపు సీనియరు సివిల్ కోర్టు న్యాయమూర్తి జీఎం లక్ష్మి తీర్పు ఇచ్చారు. పణంబూరు ఎంసీఎఫ్ సంస్థలో మహేశ్ భట్ సేవలు అందిస్తున్నారు. ఆయన సేవాకాలం, పింఛను, ఇతర ప్రయోజనాలు అన్నీ కలిపి రూ.1.06 కోట్లుగా అంచనా వేశారు. అప్పటి నుంచి ఈ ఏడాది వరకు 6 శాతం వడ్డీతో కలిపి రూ.1.35 కోట్లు అందించాలని బీమా సంస్థను న్యాయమూర్తి ఆదేశించారు.

దినేశ్ గుండూరావుపై ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: గాంధీ జయంతి వేడుకల్లో వీర సావర్కర్‌ను ఉద్దేశించి ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తేజస్ గౌడ అనే వ్యక్తి నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'వీర సావర్కర్ బ్రాహ్మణుడైనా, మాంసం తినేవారు. గోమాంసానికి వ్యతిరేకంగా ఎన్నడూ వ్యాఖ్యలు చేయలేదు. ఆయన అభ్యుదయవాది' అని దినేశ్ గుండూరావు చేసిన వ్యాఖ్యలపై పలు విమర్శలు వచ్చాయి. తాను చేసిన వ్యాఖ్యల అసలు అర్థం అది కాదని, గుండూరావు వివరణ ఇచ్చారు. గోమాంసం తినేవారిపై సావర్కర్ ఎప్పుడూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని గుర్తు చేశారు.

బెదిరిన దసరా ఏనుగు

మండ్య, న్యూస్‌టుడే: శ్రీరంగపట్టణలో దసరా వేడుకలను నిర్వహించేందుకు మైసూరు నుంచి తీసుకువచ్చిన దసరా ఏనుగు హిరణ్య పట్టణ వీధుల్లో అడ్డదిడ్డంగా పరుగు పెట్టింది. మినీ విధానసౌధ వద్ద తాలీము నిర్వహిస్తున్న సమయంలో అక్కడకు చేరుకున్న ప్రజలను, ఒక గుర్రాన్ని చూసి అది కంగారు పడింది. మావటీలు తక్షణమే స్పందించి, దాన్ని నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని మైసూరు, కొడగు, చామరాజనగరల్లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు తీసుకువచ్చిన ఏనుగులు జంబూ సవారి సమయంలో బెదిరిపోకుండా, మావటీలు, అటవీశాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు.

బెంగళూరే నంబరు ఒన్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: దేశంలో అత్యంత ట్రాఫిక్ దట్టత ఉండే నగరాల్లో బెంగళూరు మొదటిస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాఫిక్ క్వాలిటీ ఇండెక్స్ ప్రకారం బెంగళూరు నగరం వెయ్యికి 787 పాయింట్లతో మొదటిస్థానంలో నిలిచింది. ముంబయి, దిల్లీ, హైదరాబాద్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. అత్యంత ఎక్కువ రద్దీగా ఉండే కూడళ్లు, వాహనాల సంఖ్య, నెమ్మదిగా కదిలే వాహనాలు తదితర అంశాలను పరిగణనలోని తీసుకుని ఒక సంస్థ ఈ టీక్యూఐ అధ్యయనాన్ని నిర్వహించింది.

యువతి బలవన్మరణం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: వైట్‌ఫీల్డ్ ప్రశాంత్ లేఅవుట్‌లో తాను ఉంటున్న పీజీలో పై అంతస్తు నుంచి కిందకు దూకి అనే గౌతమి (26) అనే యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడింది. కడపకు చెందిన ఆమె నగరంలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిని. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, దర్యాప్తు చేయవద్దని ఆత్మహత్యకు మునుపు రాసిన లేఖలో ఆమె పేర్కొంది. ఆత్మహత్య చేసుకుంటున్నందుకు తనను క్షమించాలని అదే లేఖలో తన తల్లిదండ్రులను కోరింది. వైట్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లోకాయుక్త వలలో అధికారి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: రుణాన్ని మంజూరు చేసేందుకు అర్జీపై సంతకం చేసేందుకు రూ.10 వేల లంచం తీసుకుంటున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కాంతరాజు లోకాయుక్త వలలో పడ్డాడు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు కార్యాచరణను నిర్వహించారు.

తుంగభద్రకు పెరిగిన వరద

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న వరద ప్రమాణం శనివారం పెరిగింది. రెండు రోజులుగా స్థానికంగా, జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయానికి వస్తున్న వరద ప్రమాణం 14,712 క్యూసెక్కులకు పెరిగింది. అన్ని ప్రధాన కాలువలు కలిపి మొత్తం 13,625 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1632 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తిగా నిండటానికి మరో అడుగే ఖాళీ ఉంది.

ఆరుగురి అరెస్టు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో గాల్లోకి తుపాకీ తూటాలు పేల్చి స్థానికులను ఆందోళనకు గురి చేసిన రౌడీషీటరు సిరాజుద్దీన్, అతని ఐదుగురు అనుచరులను సుద్దగుంటపాళ్య ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ప్లైవుడ్ విక్రయించే ఇలియాస్‌తో సెప్టెంబరు 20 రాత్రి తన అనుచరులను తీసుకువచ్చి గొడవకు దిగాడు. ఒక దశలో సహనాన్ని కోల్పోయి తన వద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. ఇలియాస్ ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి వారిని అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.



ఉడుపి జిల్లా అట్టూరు వద్ద సెయింట్ లారెన్స్ చర్చి




శ్రవణబెళగొళలోని గోమతేశ్వరుడు

చరిత శోధన.. ఖ్యాతి సాధన

- కోటలు, విగ్రహాలు, ప్రదేశాల అన్వేషణ, సందర్శనకు ఆసక్తి
- కన్నడనాట ఘనమైన వారసత్వ సంపద

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: కర్ణాటకలో విభిన్న పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. చరిత్ర ప్రసిద్ధ కోటలు, ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలు అనేకం. చాళుక్యులు, కృష్ణదేవరాయలు, టిప్పు సుల్తాన్, శివాజీ, జైనుల పాలనలో కర్ణాటకలో పలుచోట్ల కోటల నిర్మాణం, జైన బసదుల నిర్మాణం జరిగింది. బ్రిటిష్ వారి పాలనలో పలు ప్రాంతాల్లో చర్చిలను నిర్మించారు. సకలేశపుర సమీపంలోని మంజారాబాద్ కోట, దేవనహళ్లి సమీపంలో టిప్పు సుల్తాన్ నిర్మించిన కోట, శ్రీరంగపట్టణంలోని కోట, మడికేరి, చిత్రదుర్గ కోటలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య ఎక్కువే. పర్యాటకులతో పాటు ట్రెక్కింగ్‌కు వెళ్లే ఔత్సాహికుల సంఖ్య తక్కువేమీ కాదు. హంపీ, చుట్టుపక్కల ప్రాంతాల్లోని పురాతన ఆలయాలు, నిర్మాణాలు చూసేందుకు కనీసం మూడు రోజుల సమయం పడుతుంది. మంజారాబాద్ వద్ద ఉన్న నక్షత్రం ఆకారంలో కోటను టిప్పుసుల్తాన్ 1792లో నిర్మించారు. కెంపేగౌడ పాలనలో బెంగళూరు, మాగడి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు కోటల నిర్మాణాలు జరిగాయి. జైనులకు పుణ్యక్షేత్రం శ్రవణ బెళగొళలో ప్రతి పుష్కరానికి ఒకసారి మహా మస్తకాభిషేకాలను నిర్వహిస్తారు. ఇక్కడి బాహుబలి (గోమతేశ్వరుడు) 57 అడుగుల ఎత్తులో ఉంటాడు. ఏకశిలా గ్రానైట్‌తో చేసిన విగ్రహాల్లో ఇదే ఎత్తయినది. ఇదే తరహా విగ్రహాలు ధర్మస్థల, దక్షిణ కన్నడ జిల్లాలోని వేణూరు తదితర ప్రాంతాలలో ఉన్నాయి. చాముండి బెట్టపై ఉన్న మహిషాసురుని విగ్రహం, దేశంలో రెండో అతి పెద్ద రాతితో చేసిన నందీశ్వరుడు, బాదామిలోని గుహాలయాలు, హంపీలోని రాతి రథం, కార్కళ సమీపంలోని చార్మడి బసదికి చరిత్రకారులు ఎక్కువ మంది వస్తుంటారు. హాసన సమీపంలోని శెట్టిహళ్లిలో రోజరీ చర్చి పురాతనమైంది. హేమావతి జలాశయం నిర్మించిన అనంతరం బ్యాక్ వాటర్‌లో అది మునిగిపోయింది. జలాశయంలో నీటి స్థాయి తగ్గినపుడు ఈ చర్చి నీటి నుంచి బయట పడుతుంది. ఇదే తరహాలో తిప్పగొండనహళ్లి జలాశయంలో నీటి నిల్వలు తగ్గినప్పుడు బయటపడే ఆలయాన్ని వీక్షించేందుకు పర్యాటకులు వస్తుంటారు. కోటలు, భారీ విగ్రహాలను వీక్షించేందుకు చరిత్రకారులు, చరిత్రను అధ్యయనం చేస్తున్న విద్యార్థులతో పాటు యువత కూడా ఆసక్తి చూపిస్తోంది. వీటిని వీక్షించేందుకు వచ్చే వారిని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాలలో ట్రెక్కింగ్ వచ్చే వారికి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసేందుకు ప్రైవేటు సంస్థలతో రాష్ట్ర పర్యాటక శాఖ ఇప్పటికే చేతులు కలిపింది. దసరా సెలవుల్లో పర్యాటక, చారిత్రక ప్రదేశాల వీక్షణకు సందర్శకులు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా రవాణా, వసతి, ఇతర సదుపాయాలను నమోదు చేసుకోవడం విశేషం. నిర్వాహకులు పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం ..చూసొద్దాం పదండి.



కార్కళ సమీపంలోని చార్మడి బసది



చాముండి బెట్టపై మహిషాసురుని విగ్రహం



శృంగేరి ఆలయం లోపలి భాగం



హంపీలోని రాతి రథం

నిలువునా కూలింది..నీడ కరవైంది

శ్రమించి రక్షించిన గ్రామస్థులు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకాలోని ఢణాపురలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు కూలిపోవడంతో అందులో నివసిస్తున్న ప్రకాశ్ అనే వ్యక్తి కూరుకుపోయి గాయపడిన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పాత బండేశ్వర గుడి వద్ద ఉంటున్న ప్రకాశ్ శనివారం వేకువజామున 5.30 గంటలకు నిద్రలేచారు. వాకింగ్‌కు బయలుదేరుతుండగా రాత్రి వర్షానికి నానిన ఇంటి పైకప్పు ఆయనపై కూలింది. గమనించిన ప్రకాశ్ అక్క భాగ్యలక్ష్మి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. రాళ్లు, మట్టిలో కూరుకుపోయిన ప్రకాశ్ కొంతసేపు కనిపించలేదు. చివరికి ఆయనను గుర్తించి పారలతో మట్టి తొలగించి బయటకు తీసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రకాశ్ వెన్నెముక, కాలికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని బాధితుడి అక్కతో మాట్లాడి వివరాలు తెలుసుకొని తనవంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత ఇల్లు కావడంతో వర్షానికి తడిసి కూలిందని అన్నారు. గ్రామంలోని సముదాయ భవనంలో ప్రకాష్ కుటుంబం తాత్కాలికంగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి శివరాజ్ తంగడగి ప్రకాశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు.



మట్టిలో ఇరుక్కున్న ప్రకాశ్‌ను బయటకు తీస్తున్న గ్రామస్థులు



జాగ్రత్తగా తీస్తున్న వైనం..

గర్భకోశ క్యాన్సర్ నియంత్రణకు చర్యలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఆధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న గర్భకోశ క్యాన్సర్ నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చికిత్స విధానాన్ని అందిస్తోందని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. శనివారం ఇక్కడ వికాససౌధలో ఆరోగ్యశాఖ, అబ్‌గైన్ కర్ణాటక చాప్టర్, ఎకో ఇండియా, సీసీఈ కన్సార్టియం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలకు శత్రువుగా మారిన గర్భకోశ క్యాన్సర్ ప్రారంభంలో గురిస్తే చికిత్స ద్వారా నయం చేసి ప్రాణాలు కాపాడవచ్చునని తెలియజేశారు. వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులు ఆత్మవిశ్వాసం ఉంటూ వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు. డైరెక్టర్ డాక్టర్ హేమాదివాకర్, డాక్టర్ అలెక్సాండర్ థామస్, డాక్టర్ రాజ్‌శంకర్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.



వికాససౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

ఆయన ఇకపై న్యాయవాది కాదు

బెంగళూరు (శివాజీనగర): కన్నడ బిగ్‌బాస్ రియాల్టీ షో 11వ సీజన్‌లో పాల్గొన్న న్యాయవాది జగదీశ్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ బార్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాద వృత్తిని కొనసాగించేందుకు కౌన్సిల్‌లో ఆయన పేరు నమోదు చేసుకునే సమయంలో ఇచ్చిన పీయూసీ మార్కుల జాబితా నకిలీదని, న్యాయశాస్త్రానికి సంబంధించిన జాబితాలలోనూ స్పష్టత లేదని గుర్తించారు. ఇకపై న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయకూడదని ఆయనకు తాఖీదులు జారీ చేశారు.

రహదారిలో కారు దగ్ధం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: హోసూరు రహదారి అత్తిబెలె సమీపంలోని యడవనహళ్లి వద్ద వెళుతున్న కారులో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన కారును పక్కను నిలిపి, అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు కిందకు దిగి మంటల్ని ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. ఒక వాహనంతో అగ్నిమాపకదళ సిబ్బంది అక్కడకు చేరుకునేలోగా కారు పూర్తిగా దగ్ధమైంది. ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అత్తిబెలె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అత్తిబెలె వద్ద కాలిపోతున్న కారు

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

అలరించిన నవరాత్రి నృత్య వేడుకలు


నవదుర్గలతో బాల కళాకారులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శరన్నవరాత్రులను పురస్కరించుకుని నయన కన్నడ భవనలో శనివారం నిర్వహించిన నవరాత్రి నృత్య వేడుకలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ నృత్య కళాశాలల్లో శిక్షణ పొందుతున్న యువతులు, విద్యార్థినులు ప్రదర్శనలో పాల్గొన్నారు. అమ్మవారి రూపానికి అనుగుణంగా కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకుల్లో భక్తిభావన కలిగించింది.

భక్తితో వనదుర్గా హోమం

తుమకూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ప్రజల సంక్షేమం, సంవృద్ధి, సంతోషం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతిష్ఠించిన చాముండేశ్వరి దేవికి శనివారం జిల్లాధికారి శుభాకల్యాణ్ వన దుర్గా హోమం చేశారు. చంద్రఘంటా (మీనాక్షి) అలంకారంలోని దేవిని జిల్లాధికారి, ఎస్పీ కె.వి.అశోక్, జడ్పీ సీఈఓ జి.ప్రభు, జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కె.నాగణ్ణ తదితరులు పూజా కైంకర్యంలో పాల్గొన్నారు.


వనదుర్గ హోమపూజలో పాల్గొన్న జిల్లాధికారి, తదితరులు

644 మందికి రేషన్‌కార్డులు పంపిణీ

హోసూరు కబుర్లు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డుల్లో ఏడాది నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొంటున్నారు. అర్హులైన లబ్ధిదారులకు మొదటి విడతలో 644 మందికి రేషన్‌కార్డులను మేయర్ ఎస్.ఎ.సత్య, ఉప మేయర్ సి.ఆనందయ్య పంపిణీ చేశారు. దరఖాస్తులు చేసుకొని అర్హులైన వారికి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డి.ఎం.కె. మండల అధ్యక్షుడు అరసనట్టి రవి, కార్పొరేటర్ మమత సంతోష్, పౌరసరఫరాల శాఖ అధికారి వళర్‌మతి, ప్రత్యేక ఆర్ఐ తైయూబ్ తదితరులు పాల్గొన్నారు.


రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మేయర్ సత్య, ఉప మేయర్ ఆనందయ్య

రామానాయక చెరువును పరిశీలించిన మేయర్, కమిషనర్

హోసూరు, న్యూస్‌టుడే : రామానాయక చెరువును పర్యాటకులను ఆకర్షించడానికి పక్షిధామం, ఈత కొలను, పడవ విహారం, ఉద్యానవనం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. మేయర్ ఎస్.ఎ.సత్య, కమిషనర్ శ్రీకాంత్, ఉప మేయర్ సి.ఆనందయ్య క్షేత్ర పరిశీలన చేశారు. పనులు సంబంధించినవాటిని పరిసరాల అధ్యయనం ఉన్నాయని జీవిత లయన్స్ సంఘం సీనియర్ చైర్మన్ వై.వి.ఎస్.రెడ్డి కమిషనర్‌కు విన్నవించారు. అందుకు స్పందించి పనులను పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టి.వి.ఎస్.నగర్ కార్పొరేటర్ చన్నీరప్ప, సహాయ కమిషనర్ డిల్లా, ఇంజినీర్ రాజారాం, కార్పొరేటర్ వరలక్ష్మి శేఖర్, నాగరాజ్, మారక్క చెన్నీర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


చెరువు ప్రాంతంలో పర్యటిస్తున్న సత్య, శ్రీకాంత్ తదితరులు

చెరువుల శుభ్రతకు శ్రీకారం


చెరువు నీటిలో పెరిగిన గడ్డి తీస్తున్న కార్మికులు


స్వచ్ఛత పనుల్లో పాలికె సిబ్బంది


వాననీటితో నాయండనహళ్లి చెరువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న చెరువుల శుభ్రతకు పాలికె అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రాథమికంగా నాయండనహళ్లి, ఉల్లాల చెరువులను ఎంపిక చేసుకున్నారు. చెరువుగట్టుపై ఉండే గడ్డి, పిచ్చిమొక్కలు తొలగించారు. నీటిలో పెరుగుతున్న గడ్డి మొక్కలను పీకివేశారు. కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు ప్రవహించడంతో జలకళ వచ్చింది. గట్టు చుట్టు ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు తెలిపారు. నీరు ఎక్కువగా వస్తే గడ్డి తొలగించలేమని, అందువల్ల ఇప్పుడే తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. మొన్నటి వరకు ఎండిపోయిన రెండు చెరువుల్లోకి వాననీరు రావడంతో చుట్టు పక్కల భూగర్భ జలమట్టం పెరుగుతున్నట్లు గుర్తించారు. ఎండిపోయిన బోరు బావుల్లోకి నీరు రావడంతో ఆయా ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి అదుపులోకి వచ్చినట్లు గుర్తించారు. చెరువు నీరు స్వచ్ఛత ఉండేందుకు మురికినీరు ప్రవహించకుండా అడ్డుకట్టవేశారు. మురికి నీరు చెరువులోకి ప్రవహించకుండా పైపులు ద్వారా దిగువ ప్రదేశాలకు మళ్లించారు. నగరంలో ఉన్న మిగతా చెరువుల వద్ద స్వచ్ఛత పనులు స్థానికులతో కలిసి చేపడతామని పాలికె అధికారులు వెల్లడించారు.

సభ్యత్వాలు చేయించిన కేంద్ర మంత్రి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బెంగళూరు నగర ఉత్తర యువ మోర్చా, భాజపా సామాజిక మాధ్యమాల విభాగం ఇస్కాన్ దేవాలయం వద్ద నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె శనివారం సాయంత్రం నిర్వహించారు. మాజీ మంత్రి గోపాలయ్య, పార్టీ నాయకుడు హరీశ్ తదితరులతో కలిసి సభ్యత్వానికి సంబంధించిన నిబంధనల పత్రాలను పంపిణీ చేశారు. సభ్యత్వం చేసుకునేందుకు వచ్చిన పౌరుల ట్యాబ్‌లలో ఫొటోలు తీసి, వివరాలు భర్తీ చేసుకున్నారు. కార్డు తయారు చేసిన అనంతరం వారికి అందజేస్తామని పార్టీ నాయకుడు కరుణాకర ఖాసలే తెలిపారు. మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా కూడా పార్టీ సభ్యత్వాన్ని పొందవచ్చని ఆయన చెప్పారు.

రూ.32.60 కోట్లతో తాగునీటి పనులు ప్రారంభం

పావగడ, న్యూస్‌టుడే : జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు గుట్టహళ్ళి మెహర్ బాబా మందిరం దగ్గర రూ.32.60 కోట్ల వ్యయంతో చేపట్టిన మొదటి విడత పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ ప్రారంభించారు. పట్టణం, తాలూకాలోని పలు ప్రాంతాల్లో ఫ్లోరైడ్ కోరల్లో చిక్కుకొని అంగవైకల్యంతో పాటు పలు రకాల వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల జీవన్ మిషన్ పథకం పుణ్యమా అని ఇప్పటికే తాలూకాలోని కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. కనుమాన్‌చెర్లు, భోవి కాలనీల్లో రూ.40లక్షలు వ్యయంతో నిర్మించనున్న రెండు అంగనవాడీ కేంద్రాలకు భూమి పూజ చేశారు. తుమకూరు రహదారిలోని వలయ అరణ్య అధికారుల కార్యాలయ ఆవరణలో రూ.18లక్షల వ్యయంతో నూతన కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తాలూకా అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు పి.హెచ్.రాజేశ్, ఉపాధ్యక్షురాలు గీత హనుమంతరాయప్ప, సభ్యులు సుదేశ్‌బాబు, రవి, ప్రమోద్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, రామాంజినప్ప, విశ్వనాథ్, గొర్తి నాగరాజు, గుట్టహళ్ళి అంజప్ప, నాయకులు రామలింగ, షాబాబు, రిజ్వాన్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, తదితరులు

కన్నడ జ్యోతి రథయాత్రకు స్వాగతం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కన్నడ నాడు, నుడి, సాహిత్య, సంస్కృతితో పాటు నేల, జలాన్ని కాపాడుకోవాలన్న బాధ్యత కన్నడిగులైన మనందరిపై ఉందని మూడబిదిరే తాలూకా తహసీల్దార్ ప్రదీప్ కుమార్ కుర్డేకర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తున్న కన్నడజ్యోతి రథ యాత్ర శనివారం మంగళూరు నుంచి మూడ బిదిరే మిజారుకు విచ్చేసిన సందర్భంగా రథానికి ఘనంగా స్వాగతం పలికారు. రెవిన్యూ అధికారి మంజునాథ, ప్రతినిధులు వేణుగోపాలశెట్టి, సదానందనారావి, రామకృష్ణశిరూరు, నాగేష్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు. రథయాత్ర ఉడుపి జిల్లా కార్కళకు బయలు దేరింది.


కన్నడ రథయాత్ర వేదికలో తహసీల్దార్, అధికారులు

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కృష్ణగిరి ఎంపీ

హోసూరు, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఉదయనిధి స్టాలిన్‌ను కృష్ణగిరి పార్లమెంట్ సభ్యుడు కె.గోపీనాథ్ చెన్నైలోని ఆతని కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హోసూరులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. క్రీడలశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న ఆయనను హోసూరులోని స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని విన్నవించినట్లు గోపినాథ్ తెలిపారు.


ఉదయనిధి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపినాథ్

అధికారులను నిలదీసిన ప్రజలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలో పెద్దమురికివాడగా గుర్తింపు పొందిన ఎంఆర్ఎస్ పాళ్య ప్రజలు శనివారం ఆప్రదేశానికి వచ్చిన పాలికె ఉన్నతాధికారులను నిలదీశారు. కనీస మౌలిక సౌకర్యాలకు దూరంగా ఉన్నామని, మా సమస్యలను ఎవరు పట్టించుకోవడంలేదని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు గుడిసెల రహితంగా మార్చుతామని ప్రకటిస్తున్నా నేటికీ ఆచరణకు నోచుకోలేదని పాలికె ప్రత్యేక కమిషనర్ వికాస్‌రావును ప్రశ్నించారు. ఈప్రదేశాన్ని ఇప్పటి వరకు పాలికెలో విలీనం చేయలేదన్నారు. గతంలో ఐదు వందల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా..నేటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని గుర్తు చేశారు. స్థానిక నేతలు సి.కృష్ణగౌడ, ఎంసీ శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, కన్నడ నరసింహ, సామ్రాట్ కుమార్, డేవిడ్, రంగన్న, గంగాభవాని తదితరులు అధికారులతో మాట్లాడారు.

కుక్కే సుబ్రహ్మణ్య ఆలయంలో సంగీత కచేరీ

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : కుక్కే సుబ్రహ్మణ్య ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక బృందగానంలో బెంగళూరు సారథినగర్‌కు చెందిన బాలికలు పాల్గొన్నారు. భారతీయ సంగీత నృత్య కళాకారుల సమితి-కర్ణాటక కుక్కే సుబ్రహ్మణ్య దేవళ శాస్త్రీయ సంగీత వేదిక ఆధ్వర్యంలో ధర్మసమ్మేళన మండపంలో విదూషి సీతాలక్ష్మీ వెంకటేష్ శిష్యుల బృందాగానంలో భక్తిగీతాలు అలరించాయి.


బృందాగానంలో సంగీత కళాకారులు

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కసబ హోబళి వెంకటాపురం ఒకటో వార్డులో నివాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని యజమాని సిద్దరాజుకు ఎన్ని సార్లు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వార్డు సభ్యుడు వెంకటనాయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి ప్రకాష్, ప్రజలు మండిపడ్డారు. మద్యం సేవించిన మందుబాబులు నివాసాల మధ్య అసభ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మూడు మాసాల్లో దుకాణాన్ని మార్చుతామని లిఖిత పూర్వకంగా సిద్దరాజు రాసిచ్చాడని, ఇప్పటికీ తరలించలేదన్నారు. స్థానిక ప్రజలు గట్టిగా నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా దుకాణాన్ని తరలించకుంటే రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. మందు బాబుల నుంచి మహిళలు, బాలికలకు ఏమైనా ప్రమాదం జరిగితే అందుకు దుకాణం యజమాని సిద్దరాజు కారణమవుతాడని హెచ్చరించారు.


మద్యం దుకాణం ముందు నాయకులు, గ్రామస్తులు

ప్రతి వార్డులో సిమెంట్ రహదారి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : దాసరహళ్లి నియోజకవర్గంలోని ప్రతి వార్డులో సిమెంట్ రహదారి నిర్మాణాలు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎస్.మునిరాజు పేర్కొన్నారు. ఇక్కడ రాజగోపాల్‌నగర్ వార్డులోని తారు రోడ్డు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డణ్ణ బడవాణి, రాజకాల్వ సమీపంలో రహదారి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు, గుత్తేదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో భాజపా దాసరహళ్లి అధ్యక్షుడు సోమశేఖర్, వార్డు అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు గంగాధర్, దినేష్, నగేష్, హరీష్, భాగ్యమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

మేలుకోటెలో బొమ్మల కొలువు

మండ్య, న్యూస్‌టుడే : మేలుకోటెలో లక్ష్మీనరసింహన్, ఆయన భార్య సంగీత పదిహేను ఏళ్లుగా ఏటా శరన్నవరాత్రులకు బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. కొలువులో బొమ్మల సంఖ్యను పెంచుతుంటారు. మొదటి ఏడాది వంద బొమ్మలతో ప్రారంభమైన కొలువు. . ఇప్పుడు రెండు వేలకు పైగా బొమ్మలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల జీవనశైలి, ఆచార వ్యవహారాలను తెలుసుకునేందుకు బొమ్మల కొలువులు సహకరిస్తాయని లక్ష్మీనరసింహన్ తెలిపారు. మేలుకోటె చెలువ నారాయణుడ్ని చూసేందుకు వస్తున్న భక్తులు తమ ఇంట్లో బొమ్మల కొలువు చూసేందుకు వస్తుంటారని ఆయన తెలిపారు. నిత్యం రాత్రి ఎనిమిది గంటలకు హారతి ఇస్తుంటామన్నారు. నవరాత్రి వరకు వీరి ఇంట బొమ్మల కొలువు కొనసాగనుంది.


సంగీత లక్ష్మీనరసింహన్ దంపతులు


మండ్య: కొలువులో పేర్చిన బొమ్మలు

గాంధీబజారులో ఆకట్టుకుంటున్న బొమ్మలు

బెంగళూరు (కెంగేరి): దసరా ఉత్సవాల సందర్భంగా సంప్రదాయకంగా వస్తున్న బొమ్మల కొలువు ఏర్పాట్లకు పలువురు అసక్తికనబరుస్తున్నారు. బసవనగుడి గాంధీబజార్‌లో ఎన్.హెచ్. దసరా డాల్స్ యజమానులు చింతామణికి చెందిన నాగలక్ష్మి హనుమంతప్ప చాలా ఏళ్ల నుంచి ఇక్కడ బొమ్మల అమ్మకాలు చేస్తున్నారు. వ్యాపారదృష్టిలో కాక మన సంస్కృతిని, సంప్రదాయాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. రామాయణం, మహాభారత, పౌరాణిక కథలు, దేవాలయాల ప్రతీకలు, అమ్మవార్లు, దశావతరాలు, దుర్గాదేవి, కొండపల్లి బొమ్మలు, పింగాణితో సిద్ధం చేసిన బొమ్మలు, మైసూరు దసరా సంబరాలు, కుస్తీ పోటీల వేదిక, పక్షుల బొమ్మలు చిన్నారులను ఆకట్టుకొంటున్నాయి. బసవనగుడి నివాసులు విదేశాలకు వెళ్లినా ఏటా తమకు కొత్తగా వచ్చిన బొమ్మలను పంపమని సమాచారం ఇస్తుంటారని చెప్పారు. ఈ ఏడాది అయోధ్య బాలరామ విగ్రహానికి భారీ డిమాండ్ ఏర్పడిందని, బాలరామ విగ్రహాల కొనుగోలు చేస్తున్నారని నాగలక్ష్మి తెలిపారు.


రామాయణం అరణ్యకాండ


అయోధ్య బాలరాముని విగ్రహం

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పాదచారిమార్గాల ఆక్రమణల తొలగింపు ప్రక్రియను శనివారం పాలికె అధికారులు కొనసాగించారు. విజయనగర, జయనగర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. పాదచారి మార్గంలో ఉన్న వస్తువులు, బోర్డులు తొలగించి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించారు. పాదచారిమార్గాల్లో ఉంచిన టీవీ బాక్సులు, ఫ్యాన్లు తదితర వాటిని తరలించారు. పాదచారి మార్గంలో అక్రమంగా నిర్మించిన చిన్న కట్టడాలను తొలగించారు. ఆక్రమణదారులను నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే చర్చివీధి, ఎంజీరోడ్డు తదితర ప్రాంతాల్లో పాదచారి మార్గాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. పాదచారి మార్గాల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మహదేవపుర, ఆర్ఆర్ నగర విభాగాల్లో దశలవారీగా ఆక్రమణలు తొలగిస్తామని వెల్లడించారు. పాదచారులు సంచరించేందుకు నిర్మించిన మార్గాల్లో చిరువ్యాపారులు తమ వస్తువులు ఉంచి వ్యాపారం చేస్తున్నారన్నారు. దీంతో పాదచారులు రహదారుల్లో సంచరిస్తుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారని, సమస్యను దృష్టిలో పెట్టుకుని తొలగింపు పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు.


విజయనగరలో సిమెంట్ దిమ్మెలను తొలగిస్తున్న సిబ్బంది


అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


గృహరుణమేళాను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ సీజీఎం స్మితాసిన్హా తదితరులు


బెంగళూరు (యశ్వంతపుర): దేశ విదేశీయులను ఆకట్టుకుంటున్న బెంగళూరు నగరంలో సొంత ఇంటి కలలను నిజం చేసుకునేందుకు బ్యాంకులు ఇస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బెంగళూరు సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజరు స్మితా సిన్హా పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ సెయింట్ మార్క్స్ రోడ్డులోని ఎస్‌బీఐ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా గృహ రుణమేళను ఆమె ప్రారంభించారు. తీసుకునే రుణాల్లో పలు రాయితీలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్స్, స్వతంత్ర గృహం, ఇళ్ల స్థలం ఇలా తమకు ఇష్టమొచ్చిన వాటిని ఎంపిక చేసుకుని సొంతింటి కలను నిజం చేసుకోవాలని సూచించారు. గతంలో ఎస్‌బీఐ నిర్వహించిన గృహ రుణమేళాకు మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు.


అన్నపూర్ణేశ్వరి


శాకంబరీమాత


పార్వతీదేవి


అర్ధనారీశ్వరి


మహంకాళమ్మ

చల్లనితల్లీ.. బనశంకరీ కాపాడమ్మా

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల మూడో రోజు శక్తి స్వరూపిణి ఆరాధనలు వేదమంత్రాలతో మిన్నుముట్టాయి. ఉదయ సంధ్యల్లో భక్తులు తమ కుటుంబాలు, పిల్లలను చల్లగా కాపాడాలని అమ్మలను వేడుకోటానికి దేవస్థానాల్లో క్యూ కట్టారు. అమ్మవార్ల అలంకరణలు ప్రత్యేకత సంతరించుకోవటం మరో విశేషం. నగరానికే తలమానికమైన బనశంకరి చల్లని వట్టివేరు అలంకరణలో భక్తులను కరుణించగా శాకంబరీదేవి గరుడ వాహని నారాయణిగా ప్రత్యక్షమయ్యారు. హనుమంతనగర్‌లో పార్వతీదేవి మయూర వాహని కౌమారిగా అంబాభవానీ శ్రీలక్ష్మీ మదేవిగా రూపొందితే హొరనాడు అన్నపూర్ణేశ్వరి గజారోహిణి చంద్రఘంటగా భక్తులకు దర్శనమిచ్చారు. సీతాసర్కిల్‌లోని మంజునాథదేవస్థానం ప్రసన్న పార్వతీదేవి సింధూర అలంకారంలో కనువిందు చేశారు. దేవస్థానాల్లో దేవతామూర్తులకు అర్చకులు వైవిధ్యమయ అభిషేకాలు, చండీహోమాలు, లలితా సహస్రపారాయణాలు పవమాన, నవగ్రహహోమాలు అసంఖ్యాక భక్తుల సమక్షంలో నిర్వహించారు. భక్తిసంగీత, హరికథా కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సాయంత్రం వేళల్లో ఊరేగింపులు ఆయా వీధులకే సింగారింపులు.

సురక్షిత ఐసీసీ పురస్కారాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇండియన్ కెమికల్ కౌన్సిల్ (ఐసీసీ) సురక్షిత పురస్కారాన్ని లానెక్స్ సంస్థ స్వీకరించింది. ఇక్కడ నగరంలో జరిగిన కార్యక్రమంలో ఐసీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాకేశ్ మహేశ్వర్ నుంచి సంస్థ ఎండీ నమితేశ్ రాయ్ చౌదరి పురస్కారాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ రసాయనిక విభాగం అంటే జాగ్రత్తలతో కూడుకొన్నదని, సురక్షితకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే సంస్థలను గుర్తించి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. నమితేశ్‌రాయ్ మాట్లాడుతూ తమ సంస్థలో పని చేసే ఉద్యోగుల సంక్షేమంతో పాటు పరిసర సంరక్షణ కోసం కృషి చేస్తున్నందున ఐసీసీ పురస్కారానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు నిరంతర శిక్షణతో పాటు వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

చిత్రదుర్గం : శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం గ్రామదేవత కణివే మారెమ్మ, బరగేరమ్మ, బనశంకరి, గాయత్రీ, వేంకటేశ్వర, వినాయక తదితర దేవాలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. వందలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో దేవాలయాలను సందర్శించి మొక్కులు చెల్లించారు. మురుఘరాజేంద్ర మఠంలో వారం రోజులు శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయి.


తమలపాకుల అలంకారంలో కణివే మారెమ్మ

బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: వీలింగ్ చేస్తూ, దాన్ని వీడియోలు తీయించుకుని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్న ఒక బాలుడ్ని తలఘట్టపుర ఠాణా పోలీసులు అదుపునకు తీసుకున్నారు. వీడియోలు ఆధారంగా స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని, గాలింపు చేపట్టారు. మైనరుకు బైకు ఇచ్చిన ఆరోపణలపై అతని తల్లిదండ్రులు ఇద్దరిపై కేసు నమోదైంది.

రూపేన అగ్రహార వద్ద దుండగుల ఆగడాలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: బొమ్మనహళ్లి పరిధి రూపేన అగ్రహారలో కొందరు దుండగుల శుక్రవారం అర్ధరాత్రి రాత్రి రెచ్చిపోయారు. ఆ మార్గంలో వస్తున్న డెలివరీ బాయ్‌లపై దాడులు చేశారు. అపార్ట్‌మెంట్లు, రహదారి పక్కన నిలిపి ఉంచిన బైకుల నుంచి పెట్రోలు దొంగిలించారు. కేకలు వేసుకుంటూ వెళుతూ స్థానికులకు నిద్రాభంగం కలిగించారు. స్థానికుడు ఒకరు తన సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజ్‌ను తన ఎక్స్ కార్ప్ ఖాతాలో పోస్టు చేసి, పోలీసులకు ట్యాగ్ చేశారు.

యువకుడి బలవన్మరణం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇంట్లో తల్లిదండ్రులు నిత్యం కీచులాడుకుంటున్నారన్న వ్యధతో శివనసముద్ర వద్ద కావేరి నదిలోకి దూకి సందీప్ కుమార్ (26) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. దొడ్డబళ్లాపురకు చెందిన బాధితుడు బెంగళూరులోని నాయండనహళ్లిలో ఉంటూ, ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. తండ్రి మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుండగా, నిత్యం తల్లితో ఆయన గొడవ పడేవారు. ఇదే వ్యధతో ఇల్లు వదిలి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని అతని తల్లిదండ్రులకు అప్పగించారు. కొళ్లేగాల గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చీటీల పేరిట వంచించిన మహిళ అరెస్టు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: చీటీ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా తప్పించుకుని పరారైన మహదేవమ్మ (43) అనే మహిళను కాడుగోడి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సుమారు 200 మందితో ఆమె చీటీలు వేయించింది. పాట పాడుకున్న వారు నగదు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తన కుమార్తెను తీసుకుని మైసూరుకు పరారైంది. పోలీసులు కార్యాచరణ నిర్వహించి ఆమెను అరెస్టు చేసి, నగరానికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు.

బళ్లారి

•బళ్లారి •రాయచూరు

నేనెవరో మీకు తెలుసా?


బాలలతో మాట్లాడుతున్న శివకుమార్

రామనగర, న్యూస్‌టుడే: చెన్నపట్టణ తాలూకా చక్కెర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖాముఖి అయ్యారు. 'బాలలూ, నేనెవరో మీకు తెలుసా?' అని వారిని ప్రశ్నించారు. 'ఉప ముఖ్యమంత్రి' అంటూ విద్యార్థులు ఏక కంఠంతో చెప్పారు. కొత్తగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. రామనగర జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను వృద్ధి చేసేందుకు ప్రైవేటు సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నామని చెప్పారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

రాయచూరు : నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం భక్తులతో సందడిగా మారాయి. ఉప్పారవాడి లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో వెంకన్న శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విగ్రహానికి పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చన జరిగాయి. మధ్యాహ్నం హారతి పట్టారు. రాత్రి సౌరభ దాస సాహిత్య విద్యార్థులు హరి కథామృత నారద సంది పారాయణం చేశారు. సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య నగరేశ్వర దేవస్థానంలో శ్రీనివాసుడికి మోహిని అలంకారం చేశారు. అఖిలాండ కర్ణాటక బ్రహ్మాండ నాయకుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై గజ వాహనంపై ఊరేగారు.


శేషన వాహనంపై ఊరేగుతున్న వెంకన్న


ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య


సభకు హాజరైన కన్నడ అభిమానులు


గోకాక్ ఉద్యమకారులకు సన్మానం

కర్ణాటక కన్నడమయం చేద్దాం : సిద్ధూ

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర భాష కన్నడ అగ్రస్థానంలో ఉండాలని, కర్ణాటక కన్నడ మయం కావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆకాంక్షించారు. పరాయి భాషలను గౌరవించాలని, మాతృభాష మనుగడ కోల్పోయేలా అత్యంత ఉదారంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. కన్నడ, సంస్కృతిశాఖ, కన్నడ ప్రాధికార అభివృద్ధి సంయుక్తంగా కర్ణాటక 50 సంభ్రమ కార్యక్రమం, 40 ఏళ్ల క్రితం గోకాక్‌లో జరిగిన భాషా రక్షణ ఉద్యమం నేపథ్యం-ముందడుగుపై శనివారం రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం మైదానంలో బహిరంగ సభను నిర్వహించాయి. సీఎం సిద్ధు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏ భాషపైనా అనుచితంగా నడుచుకోవద్దని కోరారు. కన్నడలోనే పరిపాలన జరుగుతూ, ఇళ్లలోనూ మాట్లాడితే భాషను రక్షించుకోవడం సాధ్యమవుతుందని సీఎం విశ్లేషించారు. కర్ణాటకలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల వారితో కన్నడలోనే మాట్లాడుతూ, వారు నేర్చుకునేలా ప్రేరణ కల్గించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల వలే భాషా దురభిమానం చూపవద్దని సూచించారు. హైదరాబాద్ నిజాం దీర్ఘ కాలంగా పాలించినందున కలబురగిలో ఉర్దూ, రాయచూరు సరిహద్దులో తెలుగు రాష్ట్రాలు ఉన్నందున తెలుగు, మహారాష్ట్ర సరిహద్దు బీదర్ జిల్లా దగ్గర్లో ఉండటం వల్ల మరాఠా ప్రభావం కన్పించడం సహజమని తెలిపారు. ఏది ఏమైనా కర్ణాటకలో నివసిస్తున్న ఏడు కోట్ల మంది కన్నడిగులేనని పేర్కొన్నారు. కర్ణాటకంతా కన్నడ కస్తూరి గుబాళించేందుకు ఏడాదిగా సంభ్రమ కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా నవంబరు 1న విధానసౌధ ఎదుట కంచు భువనేశ్వరి మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని వెల్లడించారు. 50 మంది పురుషులు, 50 మంది మహిళలకు పురస్కారాలను ప్రదానం చేస్తామని, చరిత్ర లిఖించిన 50 పుస్తకాలను విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు

1983లో ఎమ్మెల్యేగా గెలిచా..

"1983లో తొలిసారిగా స్వతంత్ర ఎమ్మెల్యే అయ్యా. అప్పటి సీఎం హెగ్డే తనను కన్నడ కావలు సమితి (కాపాల సమితి) అధ్యక్షుడిగా ఉండాలని కోరారు. తాను సాహితీవేత్త కాదని, ఎంఏ కన్నడ చదవలేదని చెప్పా. కన్నడను అగ్రస్థానంలో ఉంచేందుకు బాధ్యత అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఏడాది రెండు నెలల తర్వాత 1984లో పట్టు పరిశ్రమశాఖ మంత్రి అయ్యాయని" సిద్ధరామయ్య జ్ఞాపకాలను పంచుకొన్నారు. భాషా కాపలా సమితి దేశంలో ఎక్కడ లేదన్నారు. తదనంతరం ఈ సమితిని కన్నడ అభివృద్ధి ప్రాధికారిగా మార్చారని తెలిపారు. మంత్రిగా పనిచేసినప్పుడు, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సంబంధించి దస్త్రాలపై కన్నడలో సంతకం చేస్తున్నానని, కేంద్రానికి, ఇతర రాష్ట్రాలకు లేఖలు రాసిన సమయంలోనే ఆంగ్లంలో సంతకం చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబరు 1, 1956లో భాషా ప్రాంతం రాష్ట్రంగా మైసూరు రాజ్యం ఆవిర్భవిస్తే, సీఎం దేవరాజ్ అరసు నవంబరు 1, 1973లో అఖండ కర్ణాటక రాష్ట్రంగా మార్చారని సీఎం గుర్తు చేశారు. 50 ఏళ్ల సంబరాలకు హాజరు కావడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి కన్నడిగుడు కర్ణాటక ఏకీకరణ ఉద్దేశాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోకాక్ ఉద్యమంలో పాల్గొన్న శివ శరణప్ప, లింగణ్ణ, సారా గోవిందు, చంద్రకాంత్ బెల్లం, కె.శాంతప్ప, కలీం పాషాను ముఖ్యమంత్రి సన్మానించారు. కన్నడ ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తం, మున్సిపల్ అధ్యక్షురాలు నరసమ్మ, మంత్రులు మహదేవప్ప, బోసురాజు, శరణ ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, బసననగౌడ తుర్విహాళ్, బాదర్లి హంపనగౌడ, ఎమ్మెల్సీలు వసంతకుమార్, బసవనగౌడ బాదర్లి, శరణేగౌడ బయ్యాపూరు, చంద్రశేఖర్ పాటిల్, జిల్లా పాలనాధికారి నితీష్, జడ్పీ సీఈవో రాహుల్, ఎస్పీ పుట్టమాదయ్య, ఆర్‌డీఏ అధ్యక్షుడు రాజశేఖర వేదికను అలంకరించారు. ఉదయం బసవేశ్వర కూడలి వద్ద నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం వరకు జరిగిన ఊరేగింపులో వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది కళాకారులు కళను ప్రదర్శించారు. కన్నడాభిమానులు జెండా పట్టుకుని ముందుకు నడిచారు. మహిళలు అధికంగా హాజరయ్యారు.


ఊరేగింపులో మహిళలు

దళితుల వర్గీకరణకు వ్యతిరేకం కాదు : ముఖ్యమంత్రి

రాయచూరు, న్యూస్‌టుడే : దళితుల వర్గీకరణకు ప్రభుత్వం వ్యతిరేకంగా లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని వెల్లడించారు. శనివారం రాయచూరు పర్యటనకు విచ్చేసిన సీఎం వ్యవసాయ విశ్వవిద్యాలయం అతిథి గృహం వద్ద పాత్రికేయులతో మాట్లాడారు. కుల గణనపై కాంతరాజు అధ్యయన నివేదికను స్వీకరించామని, దీనిపై కూడా కేబినెట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నివేదికలో దోషాలు ఉంటే సవరించే విషయమై పరిశీలిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు తనపై చేస్తున్న నిరాధార ఆరోపణలను పట్టించుకోనని సమాధానం ఇచ్చారు. రాజీనామా డిమాండ్ చేయడం అర్థ రహితమని కొట్టి పారేశారు. తప్పుడు ప్రచారాన్ని మానుకోకపోతే వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సీనియర్ నాయకులు దిల్లీలో కాంగ్రెస్ నాయకత్వాన్ని కలవడం సహజమని వ్యాఖ్యానించారు. సీఎంను మారుస్తారన్న ప్రచారం ఊహాగానాలేనన్నారు. ముడా భూ కేటాయింపుల ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని వాస్తవాన్ని మాట్లాడిన దళ్ ఎమ్మెల్యే జి.టి.దేవెగౌడ మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) సభ్యుడన్న విషయాన్ని గమనించాలన్నారు. బెంగళూరు నుంచి మైసూరు వరకు పాదయాత్ర చేయవద్దని దేవెగౌడ సలహా ఇచ్చిన విషయాన్ని సిద్ధరామయ్య గుర్తు చేశారు. విధానసభలో ప్రతిపక్ష నేత అశోక్‌పై వచ్చిన ఆరోపణలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసి మాట్లాడాలని హితవు పలికారు. తుంగభద్ర ఎడమకాలువ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.


మంత్రి బోసురాజును సత్కరిస్తున్న సీఎం

స్వాభిమాన సభలో మంత్రికి సత్కారం

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలో స్వాభిమాన సభ నిర్వహించటంలో కీలక పాత్ర పోషించిన మంత్రి ఎన్.ఎస్.బోసురాజును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వేదికపై ప్రశంసలతో ముంచెత్తారు. సభను విజయవంతంగా నిర్వహించిన క్రమంలో సీఎం అభినందించి మంత్రిని ఘనంగా సత్కరించారు.

భేటీ చేసినా తప్పేనా?

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మార్పును గురించి ఎలాంటి చర్చ జరగలేదని, తమ రాష్ట్రానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తమ పార్టీ నేతలు కలిస్తే విపరీతమైన అర్థాలు కల్పించాల్సిన అవసరం లేదని, భేటీ చేయడంలో తప్పు ఏమి ఉందని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రశ్నించారు. శనివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో వివిధ స్థానాల్లో పార్టీ ఓటమిపై అధ్యయనం చేసేందుకు ఏర్పడిన వి.ఆర్.సుదర్శన్ నేతృత్వంలోని సమితి సిద్ధం చేసిన నివేదికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నేతలను కలిస్తే నానా వదంతులు వ్యాపింపజేయడం మంచిది కాదని హితవు పలికారు. తాము దిల్లీకి వెళ్లినప్పుడల్లా అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి చర్చించడం ఆనవాయితీఅన్నారు. తాను నిత్యం ఆయనతో మాట్లాడుతుంటానని, రాష్ట్రంలో జరుగుతున్న మార్పులను గురించి అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


నివేదికను ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్‌కు అందజేసిన సమితి అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు

'లక్షమంది వచ్చినా భయపడను'

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నేను ఎవరికీ భయపడను. నన్ను రాజకీయంగా పెంచి పెద్ద చేసిన ప్రజలు, దేవుడికి భయపడతానే కాని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లాంటి వ్యక్తులు లక్షల మంది వచ్చిన భయపడబోనని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి హెచ్చరించారు. శనివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిద్ధరామయ్య అంటే ఎవరి భయమని ప్రశ్నించారు. ఆయన దేవుడా లేక దెయ్యమా? నేను ఎందుకు భయపడాలని నిలదీశారు. కుమారస్వామిని బెదిరించడం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. రాజకీయాల్లో ఆయన నీడలో తాను పెరగలేదన్నారు. ఆయన పేరు చెప్పుకుని రాజకీయం చేయలేదన్నారు. స్వశక్తితో పైకి వచ్చినట్లు తెలిపారు. ఒకప్పుడు సిద్ధరామయ్య తమ పార్టీ కార్యకర్త, దేవెగౌడ నీడల పెరిగిన వ్యక్తి అన్నారు. తనను అరెస్టు చేస్తారనే భయం లేదన్నారు. తనకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి బెదిరించాలనే ప్రయత్నాలు చేస్తున్నారని వాటికి భయపడే వ్యక్తి కాదని హెచ్చరించారు.

దర్శన్ బెయిల్‌పై విచారణ వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో నిందితులు నటి పవిత్రాగౌడ, నటుడు దర్శన్, ఇతర నిందితులు అనుకుమార్, రాఘవేంద్ర, దీపక్, పవన్ బెయిలు కోసం వేసుకున్న అర్జీల విచారణ అక్టోబరు 8కి వాయిదా పడింది. దర్శన్ తరపున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనలు వినిపించగా, ఇతర నిందితుల తరపున టామి సెబాస్టియన్ వాదించారు. దర్శన్‌ను ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని, ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సృష్టించారని నాగేశ్ వాదించారు. అభియోగపత్రంలోనూ పలు లోపాలు ఉన్నాయని తెలిపారు. నిందితుల నుంచి జప్తు చేసుకున్న కొన్ని చరవాణుల నుంచి వీడియో, ఫోన్ చాట్‌లను ఎవరు తొలగించారో ఇప్పటి వరకు గుర్తించి, వాటిని రిట్రీవ్ చేయించలేదని చెప్పారు. పట్టణగెరె షెడ్డు నుంచి సేకరించిన మన్నుకు, దర్శన్ బూట్ల కింద మట్టికి పొంతన లేదన్నారు. దర్శన్ చెప్పులు వేసుకున్నానని చెప్పగా, పోలీసులు బూట్లు ధరించి ఉన్నాడని అభియోగపత్రంలో పేర్కొన్నారని చెప్పారు. కొన్ని చరవాణులను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించలేదన్నారు. వాదనలు ఆలకించిన న్యాయమూర్తి జైశంకర్ తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అధ్యక్ష స్థానానికి రాజీనామా


బెళగావి : జిల్లా డీసీసీ బ్యాంకు అధ్యక్షుని స్థానానికి మాజీ ఎంపీ రమేశ్ కత్తి రాజీనామా చేశారు. నాలుగేళ్ల క్రితం ఏకగ్రీవంగా ఎన్నికైన రమేశ్ కత్తిపై ఇప్పుడు కొందరు డైరెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సూచనతో ఆయన రాజీనామా చేశారని ఎమ్మెల్యే బాలచంద్ర జార్కిహొళి తెలిపారు. అక్టోబరు 8 లోగా నూతన అధ్యక్షుడిని నియమిస్తామని ఆయన ప్రకటించారు. తనకు బ్యాంకుతో 42 ఏళ్ల అనుబంధం ఉండగా, అందులో పదేళ్లు డైరెక్టరుగా, 27 ఏళ్లు, అధ్యక్షుడిగా, ఐదేళ్లు ఉపాధ్యక్షుడిగా సేవలు అందించానని రమేశ్ కత్తి గుర్తు చేసుకున్నారు. వారు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టక మునుపే బాలచంద్ర సూచనలతో తాను పదవికి రాజీనామా చేశారని చిక్కోడిలో తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు.


ఇద్దరు అధికారుల బదిలీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: వివిధ శాఖల్లో సేవలు అందిస్తున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు, వారికి కేటాయించిన శాఖలు ఇలా ఉన్నాయి. డాక్టర్ త్రిలోక్ చంద్ర (కమిషనర్, పాఠశాల విద్యాశాఖ), బీబీ కావేరి (ముఖ్యమంత్రికి కార్యదర్శి, సమాచార శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు).

వినతుల వెల్లువ

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటనకు వచ్చిన క్రమంలో వివిధ సంఘ సంస్థల నిర్వాహకులు వినతి పత్రాలను అందించారు. భాజపా మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవాట్ ఆధ్వర్యంలో జనతాదళ్ మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, రైతు సంఘం నాయకుడు చామరస్ మాలీపాటిల్, కర్ణాటక రక్షణ వేదిక ప్రతినిధులు డి.బసనగౌడ, గారపాటి రామకృష్ణ, కమ్మవారి సంఘం, వర్గీకరణ విషయమై దళిత సంఘాల నాయకులు వినతి పత్రాలు అందించారు. తుంగభద్ర ఎడమ కాలువ సమస్యను పరిష్కరించాలని, నవలి జలాశయాన్ని నిర్మించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని వినతి పత్రాలు అందాయి.


ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు


బహిరంగ సభలో మాట్లాడుతున్న సిద్ధరామయ్య


సభకు హాజరైన ప్రజలు

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం : ముఖ్యమంత్రి

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కేంద్రం ఓర్వలేకపోతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, స్వాభిమాన బృహత్ సభ కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి బహిరంగ సభలో మాట్లాడారు. మహిళలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. విధంగానైనా అవినీతి ముద్ర వేసి దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని భాజపా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేవరాజ్ అరసు తర్వాత తానే పూర్తి కాలం ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి సేవలందించామని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు రాష్ట్రాన్ని దివాళా తీయించారని, ఆ నింద గ్యారంటీలు అమలు చేస్తున్న తనపై వేస్తున్నారని ఆరోపించారు. ఖజానా ఖాళీ ఐతే ఇన్ని వేల కోట్లతో అభివృద్ధి పనులు చేయగలమా అన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలుబెట్టుకున్నానన్న సంతృప్తి తనకుందన్నారు. న్యాయస్థానాల కంటే తన ఆత్మసాక్షిని నమ్ముతానని, అందుకు అనుగుణంగానే నడుచుకుంటాను తప్ప అందుకు విరుద్ధంగా వ్యవహరించనని స్పష్టం చేశారు. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధంలేని తన భార్యను నిందించడం తగునా అన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ స్వాగతోపన్యాసం చేశారు. మంత్రి బోసురాజు ప్రస్తావికంగా మాట్లాడారు. మంత్రులు మునియప్ప, మహాదేవప్ప, సతీష్ జార్ఖిహోళి, శరణప్రకాష్ పాటిల్, శివరాజ్ తంగడిగి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ, బసనగౌడ దద్దల్, బసవనగౌడ తుర్వీహాళ్, బాదర్లి హంపనగౌడ, ఎమ్మెల్సీలు బాదర్లి బసవనగౌడ, శరణేగౌడ బయ్యాపూర్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ సైడ్ లైట్స్: ముఖ్యమంత్రితో సహా అందరూ రవిబోసురాజు పేరు ప్రస్తావించారు. ఈ స్థాయి సభ తాలూకాలో తామేప్పుడూ చూడలేదని మంత్రులు మహదేవప్ప, మునియప్ప పేర్కొన్నారు. ఏర్పాట్లను మంత్రులు కొనియాడారు. సీఎం మాట్లాడేందుకు మైకు వద్దకు వచ్చిన 10 నిమిషాల వరకు ప్రజలు కేకలు, ఈలలతో సభ మారుమోగించారు. ముఖ్యమంత్రి 20 నిమిషాలు మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సభ జరిగింది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సత్కరించారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం, మంత్రులు

'కన్నడ రామయ్యగా పిలుద్దాం'


ప్రసంగిస్తున్న మంత్రి శివరాజ్ తంగడిగి, పురుషోత్తం

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడ అభివృద్ధికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారని కన్నడ, సాంస్కృతిక శాఖల మంత్రి శివరాజ్ తంగడిగి కొనియాడారు. ఏడాది పాటు సంబరాలు చేసుకుంటున్న కర్ణాటక సంభ్రమ-50 కార్యక్రమానికి స్ఫూర్తి ఆయననేనని తెలిపారు. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో కన్నడ కార్యక్రమాలు నిర్వహించడం ముఖ్యమంత్రి చలువేనన్నారు. కన్నడ అభివృద్ధి కోసం ఇంతగా తపిస్తున్న సిద్ధరామయ్యను కన్నడ రామయ్యగా పిలుచుకుందామన్నారు. శనివారం రాయచూరు వీవీలో జరిగిన గోకాక్ పోరాట నేపథ్యం-ముందడగు, కర్టాటక సంభ్రమ-50 సభలో ఉపన్యాసం చేశారు. 1973లో మైసూరు జిల్లా వాసి, సీఎం దేవరాజ్ అరసు అఖండ కర్టాటకగా మారిస్తే, 50 ఏళ్ల తర్వాత అదే జిల్లాకు చెందిన సిద్ధరామయ్య 50 ఏళ్ల వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు. గత భాజపా ప్రభుత్వం కన్నడ గురించి, రాష్ట్రం గురించి పట్టించుకున్న పాపానా పోలేదని విమర్శించారు. కన్నడ ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ కన్నడ భాషా ప్రగతి వేగంలో మందగించిందని చెబుతూ కేవలం 3.7 శాతం పెరుగుదల ఉండటం ఆందోళన కల్గిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ భాష అయినా నేర్పించవచ్చని, కన్నడలో రాయడం, మాట్లాడాన్ని నేర్పించడంలో ముందుండాలని సూచించారు.


ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు

రూ.3 వేలకు జంట హత్య

మడికేరి, న్యూస్‌టుడే : కుశాలనగర తాలూకా కూడు మంగళూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో జోసెఫ్ (55), వసంత్ (45) అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. గిరీశ్ (29), జోసెఫ్, వసంత్, మోహన్, సంజయ్ స్నేహితులు. ఇరుగు పొరుగు ఇళ్లలోనే ఉండేవారు. రూ.3 వేల నగదు చేబదులుకు సంబంధించి జోసెఫ్, గిరీశ్‌ల మధ్య గొడవలు ఉన్నాయి. ఇదే విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. వారించేందుకు వచ్చిన జోసెఫ్‌పై గిరీశ్ కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. పరారైన నిందితుని కోసం కుశాలనగర గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

దర్యాప్తును కేంద్ర సంస్థకు అప్పగించండి


సీఎంకు వివరిస్తున్న అంబాజీరావ్

రాయచూరు : అక్రమంగా కోట్లాది రూపాయిల డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన దర్వేశ్ కంపెనీ గ్రూపుల కేసు దర్యాప్తును ఈడీ లేక సీబీఐకి అప్పగించాలని సామాజిక కార్యకర్త అంబాజీరావ్ మైదరకర్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేశారు. రాయచూరుకు విచ్చేసిన సీఎంను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. సీఓడీ డైరెక్టర్లు, ఏజెంట్లు, సబ్ ఏజెంట్లను బంధించలేదని, దర్యాప్తులో పురోగతి కన్పించనందున కేంద్ర సంస్థకు ఇవ్వాలని కోరుతున్నామని వివరించారు. రైతు సంఘాలు, దళిత సంఘాల ప్రతినిధులు సమస్యలపై మనవి పత్రాన్ని ఇచ్చారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

05-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.96
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,865	3,935
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	13,625	9,556
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	53.213

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సహాయ అధ్యాపకుల ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న సహాయ అధ్యాపక ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉండి అర్హత కల్గిన అభ్యర్థులు దరఖాస్తు ఫారం కోసం www.uasraichur.karnataka.gov.in వెబ్ సైట్ డౌన్ లౌడ్ చేసుకోవచ్చు. భర్తీ చేసిన ఫారాన్ని ఈ నెల 28 లోపు ఆన్‌లైన్‌లో పంపుకోవాలని ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప ఒక ప్రకటనలో కోరారు.